ఆంధ్రజ్యోతి





పుట్టిన రోజే తనకు చివరి రోజు అవుతుందని ఆ యువకుడు ఏమాత్రం ఊహించి ఉండడు. స్నేహితులతో కలిసి చేసుకున్న బర్త్‌డే వేడుకలే అంత్యక్రియలకు కారణమవుతాయని అనుకుని ఉండడు. స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలే తమకు చివరి క్షణాలు అవుతాయని ముగ్గురు యువకులు ఊహించి ఉండరు. అందుకే బర్త్‌డే బాయ్‌తో కలిసి ఎంతో ఆనందంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మరో స్నేహితుడు వద్దు వద్దంటున్నా సతాయించి టిఫిన్ తినడానికని అతడి కారు తీసుకెళ్లారు. అనంతరం ఎందుకు బుద్ధి పుట్టిందో తెలియదు గానీ ఇంటికెళ్లాల్సిన వారు ఓ యువకుడి నానమ్మ ఇంటికి వెళ్తూ మృత్యుగాలానికి చిక్కారు. వీరు ప్రయాణిస్తున్న కారును ఓ లారీ వేగంగా ఢీకొట్టింది. దీంతో కారు నుజ్జైపోగా, యువకుల శరీరాలు ఛిద్రమయ్యాయి. చేతికి అందివచ్చిన కొడుకులు శవాలుగా పడిఉండటం చూసిన తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. రోడ్డు ప్రమాదంలో నలుగురు స్నేహితులు మృతి చెందిన సంఘటన శనివారం అర్ధరాత్రి బుక్కరాయసముద్రం మండలం రేకులకుంట వద్ద జరిగింది. వివరాలు ఇలా..


ఓబులశెట్టి పవన్ (ఫైల్)


యర్రగుడి పవన్ (ఫైల్)


శ్రీనివాసులు (ఫైల్)


ముస్తాక్ (ఫైల్)

పుట్టిన రోజే... వర్ధంతి..!

తన పుట్టిన రోజే... వర్ధంతి రోజు అవుతుందని ఆ యువకుడు ఊహించి ఉండడు. స్నేహితుల సమక్షంలో ఎంతో ఆనందంగా జరుపుకున్న పుట్టినరోజు వేడుకలే అతడికి చివరి క్షణాలు అయ్యాయి. స్టాలిన్ నగర్‌కు చెందిన మహబూబ్ బాషా, మున్నీ దంపతుల పెద్ద కుమారుడు ముస్తాక్. తండ్రి కూలిపని చేస్తుండగా ముస్తాక్ గ్రానైట్, టైల్స్ వర్కర్‌గా పని చేసి కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు. దురదృష్టవశాత్తు పుట్టిన రోజే రోడ్డు ప్రమాదంలో చనిపోవడం ఆ తల్లిదండ్రులకు తీవ్ర శోకాన్ని మిగిల్చింది.


ప్రమాదంలో నుజ్జు అయిన కారు


రేకులకుంట గ్రామం వద్ద ప్రమాద స్థలం

ఘోరం..!

పుట్టిన రోజున విషాదం

- అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం
- కారును ఢీకొన్న లారీ
- నలుగురు యువకుల దుర్మరణం
- మృతులంతా స్నేహితులే
- రేకులకుంట వద్ద దుర్ఘటన

బుక్కరాయ సముద్రం, సెప్టెంబరు 22: మండలంలోని రేకులకుంట వద్ద శనివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో అనంతపురం నగర శివారు స్టాలిన్ నగర్‌కు చెందిన ఓబులశెట్టి పవన్(26), యర్రగుడి పవన్ (24), కురుబ శ్రీనివాసులు(26), ముస్తాక్ (25) మృతి చెందారు. వీరంతా అవివాహితులే. ఈ ప్రమాదం నాలుగు కుటుంబాల్లో అంతులేని విషాదం నింపింది.

అనంతపురం స్టాలిన్ నగర్‌కు చెందిన మహబూబ్‌బాషా, మున్నీ దంపతుల కుమారుడు గ్రానైట్, టైల్స్ వర్కర్‌గా పనిచేసి జీవనం సాగించేవాడు. శనివారం ముస్తాక్ పుట్టిన రోజు కావడంతో అతడి స్నేహితులు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఓబులశెట్టి పవన్, డ్రైవర్‌గా పనిచేస్తున్న కురుబ శ్రీనివాసులు, యర్రగుడి పవన్ కలిశారు. పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని భావించారు. అనంతరం డ్రైవర్ శ్రీనివాసులు తన మరో స్నేహితుడైన పవన్‌ను కూడా బర్త్‌డే వేడుకలకు ఆహ్వానించాడు. పవన్‌కు ఉన్న ఇన్నోవా వాహనంలో ఐదుగురు బయటికి వెళ్లి పుట్టిన రోజు వేడుకలు ఆనందంగా జరుపుకున్నారు.

● సతాయించి కారు తీసుకెళ్లి..

వేడుకల అనంతరం టిఫిన్ తినడానికి అనంతపురం ఆర్టీసీ బస్టాండ్‌కు కారులోనే వెళ్లాలని స్నేహితులంతా నిర్ణయించుకున్నారు. అయితే కారు తెచ్చి ఇంకా పది రోజులు అయింది. తెలిస్తే ఇంట్లో తిడతారని చెప్పినట్లు కారు యజమాని పవన్ తెలిపాడు. స్నేహితుడైన శ్రీనివాసులు అరగంట పాటు సతాయించడంతో టిఫిన్ తినడానికే కదా వెళ్లేది త్వరగా వస్తారులే అని కారు ఇచ్చి, తాను ఇంటికి వెళ్లినట్లు తెలిపాడు. దీంతో ముస్తాక్, డ్రైవర్ శ్రీనివాసులు, యర్రగుడి పవన్, ఓబులశెట్టి పవన్ టిఫిన్ తినడానికి అనంతపురం ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లారు. అనంతరం నార్పలలో ఉన్న ఓబులశెట్టి పవన్ నానమ్మ ఇంటికి బయల్దేరారు.

● రేకులకుంట వద్ద కారును ఢీకొన్న లారీ

అలా వెళ్తుండగా నార్పల నుంచి వేరుశనగ కాయల లోడ్‌తో వస్తున్న లారీ రేకులకుంట గ్రామం వద్ద కారును వేగంగా ఢీకొంది. దీంతో కారు నుజ్జునుజ్జు అయ్యింది. అందులో ఉన్న నలుగురు స్నేహితులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. కారు నడుపుతున్న శ్రీనివాసులు శరీరం రెండు ముక్కలై కారులోనే ఇరుక్కొని పోయింది. మిగిలిన ముగ్గురి శరీరాలు ఛిద్రమై చెల్లాచెదురుగా పడ్డాయి. దీంతో రోడ్డంతా రక్తసిక్తం అయ్యి భీతావాహ పరిస్థితిని కలిగించింది. లారీ డ్రైవర్ తాతయ్య గాయపడినట్లు పోలీసులు తెలిపారు. లారీ అతి వేగమే ప్రమాదానికి కారణమై ఉంటుందని పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

● అర్ధరాత్రి పోలీసుల సహాయక చర్యలు

శనివారం రాత్రి రోడ్డు ప్రమాదం జరగడంతో అటు వైపు వెళ్తున్న వాహనదారుడు డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సీఐ కరుణాకర్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాలు చెల్లాచెదురుగా పడి, కారు పూర్తిగా లారీలో ఇర్కుకొని పోయింది. ఏదైనా చేద్దామన్నా తగినంత మంది సిబ్బంది లేకపోవడంతో డీఎస్పీ వెంకటేశ్వర్లుకు సమాచారం అందించారు. తర్వాత వచ్చిన సిబ్బంది సాయం తో ఎక్స్‌కవేటర్ ద్వారా కారును బయటకు లాగారు. అందులో ఇరుక్కుపోయిన మృతదేహాన్ని బయటకు తీశారు. తెల్లవారుజాము నాలుగు గంటల వరకు ఈ కార్యక్రమాలు కొనసాగాయి. ఉదయం 5 గంటలకు మృతదేహాలను అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు.

● ఉద్యోగం వచ్చిన 15 రోజుల్లోనే...

ఓబులశెట్టి పవన్‌కుమార్ ఎంబీఏ పూర్తి చేశాడు. రెండేళ్లుగా సాఫ్ట్‌వేర్ జాబ్ కోసం ప్రయత్నించాడు. గత 15 రోజుల కిందట బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చింది. కష్టపడి చదివించినందుకు తన కుమారుడికి సాఫ్ట్‌వేర్ జాబ్ వచ్చిందని అతడి తండ్రి ప్రసాద్ ఎంతో సంబరపడ్డాడు. ఇన్నాళ్లు కూలి పని చేశామని, ఇక కుమారుడే తమ ఆలనా పాలనా చూస్తాడని ఎంతో ఆనందపడ్డాడు. అయితే వారి ఆనందం 15 రోజుల్లోనే ముగిసింది. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు ఇంటికి వెలుగవుతాడనుకుంటే శవంగా మారాడని ఆ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.


బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

● అరగంటలో వస్తానని.. చెప్పి..

తన స్నేహితుడి పుట్టిన రోజు ఉందని, చూసుకుని అరగంటలో వస్తానని చెప్పి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయావా అంటూ మృతుడు యర్రగుడి పవన్ తల్లిదండ్రులు విలపించారు. స్టాలిన్ నగర్‌కు చెందిన యర్రగుడి నారాయణకు ఒక్కగానొక్క కుమారుడు పవన్. తండ్రి లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పవన్ గుంటూరు సెల్ఫ్‌ల (భవననిర్మాణ కార్మికుడు)పని చేసేవాడు. చేతికి అందివచ్చిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడటంతో ఆ తల్లిదండ్రులు కుప్పకూలి పోయారు. త్వరలోనే ఓ ఇంటివాడిని చెద్దామని అనుకుంటే.. ఇంతలోనే మమ్ము విడిచిపోయావా అంటూ పవన్ తల్లి రోదించడం చూసిన స్థానికులు కన్నీటిపర్యంతమయ్యారు.

● చేతికి అందొచ్చాడని అనుకుంటే..

చేతికి అందొచ్చిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కురుబ శ్రీనివాసులు తల్లిదండ్రులు విలవిల్లాడిపోయారు. కుటుంబా నికి చేదోడుగా ఉన్న రెండో కుమారుడు కురుబ శ్రీనివాసులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో స్టాలిన్ నగర్‌కు చెందిన అతడి తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. తండ్రి కురబ వెంకటేష్ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శ్రీనివాసులును పదోతరగతి వరకు చదివించాడు. ఆర్థిక భారంతో చదువు మాన్పించి డ్రైవింగ్ నేర్పించాడు. అనంతపురంలోని ఓ కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండేవాడు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం ఆ కుటుంబాన్ని అంతులేని విషాదంలో ముంచింది.

● ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

రేకులకుంట గ్రామం వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాద స్థలాన్ని ఎస్పీ జగదీష్, అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆదివారం పరిశీలించారు. రోడ్డు ప్రమాదం ఎలా జరిగిందని స్థానిక పోలీసులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంపై విచారణ చేసి, కారణమైన లారీ డ్రైవర్‌పై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

● చాలా బాధాకరం : ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

రేకులకుంట గ్రామం వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో స్టాలిన్‌నగర్‌కు చెందిన టీడీపీ కార్యకర్తలు మృతి చెందడం బాధాకరమని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ అన్నారు. మృతదేహాలను అనంతపురం సర్వజన ఆస్పత్రిలో పరిశీలించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరుపై బుక్కరాయసముద్రం సీఐ కరుణాకర్‌తో ఆరా తీశారు. అనంతరం మృతుల కుటుంబాలకు అంత్యక్రియల కోసం ఒక్కొక్కరికి రూ. 10వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే ప్రభుత్వం నుంచి వీలైనంత ఆర్థిక సాయం అందేలా చూస్తామని మృతుల కుటుంబాలకు హామీ ఇచ్చారు.

19 మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 22 : జిల్లాలోని 19 మండలాల్లో శనివారం రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా గుత్తిలో 96.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. తాడిపత్రి 46.2, వజ్రకరూరు 26.2, పామిడి 23.4, పెద్దపప్పూరు 14.6, గుమ్మగట్ట 14.2, కణేకల్లు 11.0, విడపనకల్లు 10.8, పెద్దవడుగూరు 8.2, ఉరవకొండ 7.2, పుట్లూరు 6.8, గుంతకల్లు 4.4, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, నార్పల 3.2, యాడికి 2.4, కూడేరు 2.0, అనంతపురం 1.0 మి.మీ వర్షపాతం నమోదైంది.

టమోటా కిలో రూ.46

అనంతపురంరూరల్, సెప్టెంబరు 22: స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.46తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. ఆదివారం 2,100 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.36, కనిష్ఠ ధర రూ.23 పలికినట్లు ఆయన తెలిపారు.

తడిసిన వేరుశనగ పంట

గుత్తిరూరల్, సెప్టెంబరు 22: మండలంలోని బేతాపల్లి, గొంది పల్లి, జక్కలచెరువు, ఊబిచేర్ల, చేట్నేపల్లి, తదితర గ్రామాల్లో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వేరుశనగ పంట తడిసి పోయింది. గ్రామాల్లో రైతులు సాగు చేసిన వేరుశనగ పంటను తొలగించారు. మండల వ్యాప్తంగా సుమారు 300 ఎకరాలల్లో వేరుశనగ పంట తడిసి పోయింది. మేత నల్లగా కావడంతో మేత పనికి రాకుండ పోతుందని రైతులు అంటున్నారు. గుత్తి మండలంలో 96.6 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ ఓబులేసు తెలిపారు.


తడిసిపోయిన వేరుశనగ పంట


నీటమునిగిన వేరుశనగ పైరును పక్కకు వేస్తున్న రైతు


హెచ్చెల్సీలో మూడు షెట్టర్లను కిందకు దింపిన కర్ణాటక రైతులు

జల చౌర్యాన్ని పట్టించుకోని అధికారులు

హెచ్చెల్సీ అధికారులపై రైతుల ఆగ్రహం

విడపనకల్లు, సెప్టెంబరు 22: జీబీసీ (గుంతకల్లు బ్రాంచ్ కెనాల్)కి న్యాయంగా రావాల్సిన నీటిని కర్ణాటక రైతులు అక్రమంగా తరలించుకుపోతున్నా హెచ్చెల్సీ అధికారులు పట్టించుకోవటం లేదని ఆయకట్టు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారికంగా హెచ్చెల్సీకి 1800 కూసెక్కుల నీరు రావాల్సి ఉండగా 1400ల క్యూసె క్కులు కూడా రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాల రైతులు, జీబీసీ అధికారులు ఆదివారం హెచ్చెల్సీపై పర్యటించారు. ఒన్నల్లి వద్ద హెచ్చెల్సీకి ఏర్పాటు చేసిన 4 క్రాస్ వాల్ షట్టర్లలో మూడు షట్టర్లను 9వ కాలువ(ఆంధ్ర, కర్ణాటకకు సంబంధించినది) ఆయకట్టు రైతులు కిందికి దింపి ఒక్క షట్టర్ ద్వారానే నీరు కిందికి వచ్చే ఏర్పాట్లు చేశారు. దీంతో హెచ్చెల్సీకి కనీసం 1400 కూసెక్కుల నీరు రావాల్సిన చోట 900 క్యూసెక్కులే వస్తున్నట్లు అంచనా వేశారు. ఇంత తక్కువ నీరు వస్తే జీబీసీ, పీఏబీఆర్, ఎంపీఆర్ డ్యాంలకు నీరు ఏవిధంగా అందుతుందని ఆయకట్టు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం 9వ కాలువకే ఈ స్థాయిలో నీటిని తరలిస్తూ ఉంటే హెచ్చెల్సీ అధికారులు ఎందుకు పట్టించుకోవటం లేదని ప్రశ్నించారు. ఈ విషయాన్ని వెంటనే మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన హెచ్చెల్సీ అధికారులతో ఫోన్‌లో చర్చించి జీబీసీ, పీఏబీఆర్, ఎంపీఆర్ డ్యాంలకు పూర్తి స్థాయిలో నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జీబీసీకి పూర్తి స్థాయిలో సాగు నీరు వచ్చే వరకూ అధికారులు కాలువపైనే తిరుగుతూ ఉండాలని తెలిపారు.

ఐదేళ్లలో గంపెడు మట్టి తీయని వైసీపీ

మంత్రి పయ్యావుల కేశవ్

బెళుగుప్ప, సెప్టెంబరు 22: వైసీపీ అయిదేళ్ల పాలనలో ఒక కిలోమీటరు కాలువ తవ్వలేదు. గంపెడు మట్టి తియ్యలేదని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ధ్వజమెత్తారు. మండలంలోని జీడిపల్లి రిజర్వాయరును ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు సీఎంగా ఉండగా ఆరు పంపులతో హంద్రీనీవాకు నీరందించామని, ఇప్పటికీ అదేపద్ధతి నడుస్తోందన్నారు. అనంతపురం, చిత్తూరు జిల్లాలకు పూర్తి స్థాయిలో నీరందించడానికి 12 పంపుల ద్వారా నీటి సరఫరాకు సీఎం చంద్రబాబు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని, ఇందులో భాగంగానే ఇరిగేషన్ మంత్రి క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారన్నారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి రైతాంగాన్ని ఆదుకోవడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. టీడీపీ నాయకులు, గ్రామ సర్పంచ్ వెంకట నాయుడు, పెద్ద తిప్పయ్య, మల్లికార్జున, దామోదర తిమ్మప్ప, యర్రిస్వామి, తమ్మినేని, పవన్ కల్యపల్లి తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

ప్రతి ఎకరాకు నీరిస్తాం

- హంద్రీనీవా కాలువను వెడల్పు చేస్తాం
- వచ్చే సీజన్‌కు 3850 క్యూసెక్కుల నీటిని పారిస్తాం
- జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు


మీడియాతో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

అనంతపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతి ఎకరాకు సాగునీరందిస్తామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా ఆదివారం ఆయన జిల్లాకు వచ్చారు. ముందుగా హంద్రీనీవా ప్రాజెక్టు పరిధిలోని జీడిపల్లి రిజర్వాయర్‌ను సందర్శించారు. అనంతరం అనంతపురానికి వచ్చిన మంత్రి రోడ్లు, భవనాల అతిథి గృహంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి జలవనరులే అత్యంత కీలకమని, ముఖ్య మంత్రి చంద్రబాబు ఆదేశాలతో తాను ప్రాజెక్టుల సందర్శన చేపట్టినట్లు తెలిపారు. ప్రజలకు తాగు నీరు, రైతులకు ప్రతి ఎకరాకు సాగు నీరందించాలన్నదే తమ ప్రభుత్వ ప్రాధాన్యం అన్నారు. సీమను రతనాల సీమగా చేయాలన్న సంకల్పంలో భాగంగానే నాడు నందమూరి తారక రామారావు తెలుగు గంగ, గాలేరు నగరి తదితర ప్రాజెక్టులు చేపట్టారన్నారు. కాగా ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్ ప్రాజెక్టులన్నింటినీ భ్రష్టుపట్టించారని మండిపడ్డారు. సీమ బిడ్డ అని చెప్పుకోవడమే గానీ రాయలసీమకు అత్యంత ద్రోహం చేసిన వ్యక్తి జగన్ అన్నారు. చంద్రబాబు తన గడిచిన ఐదేళ్ల పాలనలో హంద్రీనీవాకు రూ.4200 కోట్లు ఖర్చు పెడితే జగన్ కేవలం రూ.500 కోట్లు ఖర్చుపెట్టారన్నారు. ప్రాజెక్టులపై జగన్ నిర్లిప్తత, నిర్లక్ష్యం, దగా, ద్రోహానికి ఇదే పరాకాష్ఠ అన్నారు.

ఐదేళ్లూ జగన్ మొద్దునిద్ర

కృష్ణా జలాలతో జిల్లాను సస్యశ్యామలం చేయాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. హంద్రీనీవా ద్వారా 3850 క్యూసెక్కుల నీటిని తెచ్చుకునేందుకు అవసరమైన పంపులున్నా జగన్ వాటిని ఉపయోగించలేదన్నారు. ప్రస్తుతం 1900 క్యూసెక్కులు మాత్రమే నీరువస్తోందన్నారు. ఫేజ్-2 ద్వారా 700 క్యూసెక్కులు నీరువస్తోంద న్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల విషయంలో జగన్ ఐదేళ్లు మొద్దు నిద్ర పోయారని విమర్శించారు. జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ వర్గాల సహకారంలో హంద్రీనీవా ప్రధాన కాలువ ద్వారా వచ్చే సీజన్‌కు 3850 క్యూసెక్కుల నీటిని పారిస్తామని హామీ ఇచ్చారు. హంద్రీనీవా కాలువ విస్తరణ పనులు చేపట్టి ఫేజ్ - 2 కింద కదిరి, పుట్టపర్తికి నీరు ఇస్తామన్నారు. నాడు గొల్లపల్లి రిజర్వాయర్‌కు నీళ్లు ఇవ్వడం వల్లే జిల్లాకు కియ పరిశ్రమ వచ్చిందన్నారు. హంద్రీనీవా విస్తరణకు సంబంధించిన అంశంపై ఈనెలాఖరు లోపు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి, ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, బండారు శ్రావణి శ్రీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి పాల్గొన్నారు.

● వైసీపీ పాలనలో ఇరిగేషన్ నిర్వీర్యం

బెళుగుప్ప : జగన్మోహన్‌రెడ్డి నిర్లక్ష్యంతోనే రాష్ట్రంలో ఇరిగేషన్ వ్యవస్థ నిర్వీర్యమైపోయిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. వైసీపీ పాలన ఐదేళ్లలో ఇరిగేషన్ వ్యవస్థ 25 ఏళ్లు వెనక్కిపోయిందని పేర్కొన్నారు. జీడిపల్లి రిజర్వాయరును ఎమ్మెల్యేల కాలవ శ్రీనివాసులు సురేంద్రబాబుతో కలిసి ఆదివారం ఆయన పరిశీలించారు. నీటి సామర్థ్యం, ఇన్‌ఫ్లో, కాలువ ఆధునికీకరణ తదితర వివరాలను హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఎస్‌ఈ దేసేనాయక్, డీఈ విశ్వనాథరెడ్డిలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పట్టించుకోనందున హంద్రీనీవా ఆయకట్టు రైతులకు అన్యాయం జరిగిందన్నారు. హంద్రీనీవా పథకం ద్వారా 60 టీఎంసీలు నీరు వాడుకోవాల్సి ఉండగా 25 టీఎంసీలు మాత్రమే వాడుతున్నామని తెలిపారు. భైరవానితిప్ప ప్రాజెక్టుకు నీరిచ్చి 114 చెరువులకు నీరందేలా చేస్తామని హామీ ఇచ్చారు. కరువు జిల్లాను సస్యశ్యామలం చేస్తామన్నారు. కాగా రిజర్వాయరు ఊటనీటితో గ్రామానికి ప్రమాదం పొంచి ఉందని ఆదుకోవాలంటూ గ్రామ సర్పంచ్ వెంకటనాయుడు టీడీపీ నాయకులు మంత్రికి విన్నవించారు. సమస్య పరిష్కరిస్తామని, ఆందోళన చెందకండి అని మంత్రి వారికి హామీ ఇచ్చారు.

బీటీపీని పూర్తి చేయండి

మంత్రికి ఎమ్మెల్యే అమిలినేని వినతి

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం ప్రాంతానికి జీవనాడైన బీటీపీ(భైరవానితిప్ప ప్రాజెక్టు)ని సమగ్రంగా పూర్తి చేసి, రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు.. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు విన్నవించారు. జీడిపల్లి రిజర్వాయర్ పరిశీలనకు ఆదివారం వచ్చిన మంత్రిని ఎమ్మెల్యేతోపాటు నియోజకవర్గంలోని వందలాది మంది రైతులు కలిసి సమస్యను విన్నవించారు. వెనుకబడిన ఈ ప్రాంతంలో చాలామంది రైతులు వ్యవసాయంపైనే ఆధారపడ్డారని, నియోజకవర్గంలోని 114 చెరువులను బీటీపీ ద్వారా నీటితో నింపాలని కోరారు. స్పందించిన మంత్రి మాల్యాల నుంచి జీడిపల్లి వరకు హంద్రీనీవా కాలువను వెడల్పు చేసి, కళ్యాణదుర్గం, రాయదుర్గం ప్రాంతాలకు సాగు, తాగునీటిని అందిస్తామని హామీ ఇచ్చారు.


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేలు అమిలినేని, కాలవ

హౌసింగ్‌లో బదిలీలు

అనంతపురం సిటీ, సెప్టెంబరు 22: జిల్లా గృహ నిర్మాణశాఖలో పని చేస్తున్న ఆరుగురు రెగ్యులర్ ఏఈలు, 14మంది అవుట్‌సోర్సింగ్ ఏఈలు, మండల ఇన్‌చార్జిలు, 19మంది కంప్యూటర్ ఆపరేటర్లను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	హోదా	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
జమీల్ అహ్మద్	ఏఈ	అనంతపురం అర్బన్	ఆత్మకూరు
రామ్మూర్తి	ఏఈ	అనంతపురం రూరల్	బీకేఎస్
షాషావలీ	ఏఈ	గుంతకల్లు	పెద్దపప్పూరు
విజయభాస్కర్‌రావు	ఏఈ	కళ్యాణదుర్గం(ఎస్‌డీ)	కళ్యాణదుర్గం రూరల్
హనుమప్ప	ఏఈ	ఉరవకొండ (ఎస్‌డీ)	కూడేరు
లోక్‌నాథచౌదరి	ఏఈ	కళ్యాణదుర్గం రూరల్	కళ్యాణదుర్గం అర్బన్

అవుట్ సోర్సింగ్ ఏఈలు, మండల ఇన్‌చార్జిలు ఇలా..

అనిల్‌కుమార్	ఏఈ	ఆత్మకూరు	గార్లదిన్నె
సంపత్‌కుమార్	ఏఈ	పామిడి	నార్పల
రాజశేఖర్‌రెడ్డి	ఏఈ	బీకేఎస్	తాడిపత్రి అర్బన్
సంధ్య	ఏఈ	తాడిపత్రి అర్బన్	పుట్లూరు
నవీన్‌కుమార్	ఎంఐసీ	పెద్దపప్పూరు	తాడిపత్రి రూరల్
లోకేష్‌కుమార్	ఎంఐసీ	పుట్లూరు	యాడికి
ప్రశాంత్‌కుమార్	ఎంఐసీ	యాడికి	గుమ్మఘట్ట
వాసంతి	ఏఈ	గుమ్మఘట్ట	బొమ్మనహాల్
రామ్మోహన్	ఏఈ	కళ్యాణదుర్గం అర్బన్	బ్రహ్మసముద్రం
చైతన్యరాజ్	ఎంఐసీ	బ్రహ్మసముద్రం	రాయదుర్గం రూరల్
శివారెడ్డి	ఏఈ	బెళుగుప్ప	అనంతపురం అర్బన్
శేఖర్	ఏఈ	కూడేరు	విడపనకల్లు
గోపీచాంద్‌నాయక్	ఎంఐసీ	విడపనకల్లు	బెళుగుప్ప
మారుతి	ఎంఐసీ	గుంతకల్లు అర్బన్	పామిడి

విద్యుత్ శాఖలో..

అనంతపురంరూరల్, సెప్టెంబరు 22: ఉమ్మడిజిల్లా విద్యుత్ శాఖ పరిధిలో ఉద్యోగులు, సిబ్బంది బదిలీలు ఆదివారం పూర్తయ్యాయి. ఆ మేరకు ఎస్‌ఈ సంపత్‌కుమార్ బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. జేఏఓలు 14 మంది, సీనియర్ అసిస్టెంట్లు 50 మంది, జూనియర్ అసిస్టెంట్లు 69 మంది, ఓఎస్ ఓలు ఆరుగురు, ఎఫ్ఎం గ్రేడ్-1 ఇద్దరు, సీనియర్ లైన్‌ఇన్‌స్పెక్టర్లు ఇద్దరిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. పలువురు లైన్‌మెన్, ఫోర్‌మెన్లకు ఉద్యోగోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉమ్మడి జిల్లాకు ముగ్గురు ఎంపీడీఓలు
ఇతర జిల్లాలకు ఆరుగురు బదిలీ

అనంతపురం విద్య, సెప్టెంబరు 22: ఉద్యోగుల సాధారణ బదిలీలలో భాగంగా ఇతర జిల్లాల నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లాకు ముగ్గురు ఎంపీడీఓలను కేటాయించారు. జిల్లా నుంచి ఆరుగురు ఎంపీడీఓలను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. ఈ మేరకు పంచాయతీ రాజ్‌శాఖ డైరెక్టర్ క్రిష్ణతేజ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్ఆర్ కడప జిల్లా నుంచి ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి, చిత్తూరు జిల్లా నుంచి పోలప్ప, యాదవేంద్ర అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. అదేవిధంగా అనంతపురం జిల్లా నుంచి ఎంపీడీఓలు సాల్మన్, వరలక్ష్మి, పుల్లయ్య, విజయలలిత, రఘునాథ్ కర్నూలు జిల్లాకు, కిరణ్ మోహన్‌రావు కడప జిల్లాకు బదిలీ అయ్యారు.

అటవీ శాఖలో...

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 22: సాధారణ బదిలీల్లో భాగంగా ఆదివారం జిల్లాలో పలువురు రేంజర్లు బదిలీ అయ్యారు. సోషల్ ఫారెస్ట్ రేంజర్‌గా ఉన్న డేవిడ్‌ను స్క్వాడ్ పార్టీ రేంజర్‌గా ఆత్మకూరుకు బదిలీ చేశారు. ఖాళీగా ఉన్న కళ్యాణదుర్గం రేంజ్‌కు తిరుపతి నుంచి లక్ష్మిపతిని రేంజర్‌గా నియమించారు.

సూపరింటెండెంట్ల నియామకం

జిల్లా అటవీశాఖలో ఇద్దరు సూపరింటెండెంట్లను నియమిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. అమానుల్లాషాను కర్నూలు డివిజన్ కార్యాలయం నుంచి సీసీఎఫ్ కార్యాలయానికి నియమించారు. తిరుపతి సర్కిల్ కార్యాలయం నుంచి వెంకటపతిని అనంతపురం టెరిటోరియల్ డివిజన్‌కు బదిలీ చేశారు.

డ్వామా పీడీగా సలీం

అనంతపురం క్లాక్‌టవర్: డ్వామా పీడీగా సలీం బాషా నియమితులయ్యారు. కర్నూలు డీఆర్‌డీఏ-వెలుగు పీడీగా పనిచేస్తున్న సలీంబాషాను ఇక్కడ జిల్లా డ్వామా పీడీగా బదిలీ చేశారు. ఇక్కడ పీడీగా పనిచేస్తున్న వేణుగోపాల్‌రెడ్డిని మాతృశాఖ జైళ్ల డిపార్ట్‌మెంట్‌కు బదిలీ చేసిన విషయం తెలిసిందే. దీంతో డ్వామా ఏఓగా ఉన్న విజయలక్ష్మి ఇన్‌చార్జి పీడీగా కొనసాగారు. ఇన్‌చార్జి పీడీగా ఉన్న విజయలక్ష్మిని గుంతకల్లు డీఎల్‌డీఓగా బదిలీ చేశారు. డ్వామాలో ఎఫ్ ఎంగా పనిచేస్తున్న వెంకటనాయుడును ప్రకాశం జిల్లా డీపీఓగా బదిలీ చేశారు. డ్వామాలో ఏఓ, ఎఫ్ఎం పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది.

డీఆర్‌డీఏ-వెలుగు పీడీ బదిలీ

డీఆర్‌డీఏ-వెలుగు ఇన్‌చార్జి పీడీ ఓబులమ్మను కడప జడ్పీ సీఈఓగా బదిలీ చేశారు. ఇది వరకు రెగ్యులర్ పీడీగా ఉన్న నరసింహారెడ్డిని డోన్ డీఎల్‌డీఓగా బదిలీ చేశారు. డీఆర్‌డీఏ-వెలుగు పీడీగా ఎవరినీ నియమించలేదు.

డీపీఓగా నాగరాజునాయుడు

అనంతపురం న్యూటౌన్: జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కర్నూలు డీపీఓగా ఉన్న నాగరాజునాయుడుని నియమిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి డీపీఓ ప్రభాకర్‌రావు బదిలీపై పలుమార్లు చర్చలు జరిగాయి. ఎన్నికల సమయంలో వైసీపీకి కొమ్ముకాశారని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఫిర్యాదు కూడా చేశారు. ప్రభాకర్‌రావు ఇక్కడే ఉండటానికి చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో ఎట్టకేలకు బదిలీ కాక తప్పలేదు.

అటవీశాఖాధికారిగా వినోద్‌కుమార్

పుట్టపర్తిరూరల్: జిల్లా సామాజిక అటవీశాఖాధికారిగా కె. వినోద్‌కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్వర్వులు జారీచేసింది. గతంలో జిల్లా సామాజిక వనవిభాగ అటవీశాఖాదికారిగా విధులు నిర్వర్తించిన శ్యామల పదోన్నతిపై కర్నూలు జిల్లాకు బదిలీపై వెళ్లారు. అదే విధంగా రాజమహేంద్రవరం టెరిటోరియల్ అటవీశాఖాధికారిగా విధులు నిర్వర్తిస్తున్న టి. చక్రపాణిని శ్రీసత్యసాయి జిల్లా డీఎఫ్ఓగా, ఆ జిల్లాలో డీఎఫ్ఓ విధులు నిర్వర్తిస్తున్న రవీంద్రనాథరెడ్డిని బదిలీ చేస్తూ రాష్ట్రప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అనంతరాము ఉత్వర్వులు జారీచేశారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ల బదిలీ..

అనంతపురం న్యూటౌన్: గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్)లో పలువురు ఇంజనీర్లను బదిలీ చేశారు. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల 28న బదిలీల ప్రక్రియలో భాగంగా కర్నూలులోని సర్కిల్ కార్యాలయంలో కౌన్సిలింగ్‌కు హాజరయ్యారు. అందులో భాగంగా వారు ఇచ్చిన అప్షన్స్‌కు అనుగుణంగా స్థానాలు కేటాయించారు. శింగనమల డీఈగా ఉన్న గంగాధర్ బుక్కపట్నం డీఈగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో తాడిపత్రి డీఈగా ఉన్న శ్రీరాములును నియమించారు. ఆయన స్థానంలో పులివెందుల నుంచి రాంగోపాల్‌రెడ్డిని నియమించారు. రాప్తాడు డీఈగా ఉన్న రెహనా వసీం గుత్తికి బదిలీ అయ్యారు. ఆ స్థానంలో పులివెందుల నుంచి శ్రీధర్ నియమితులయ్యారు. కళ్యాణదుర్గం ఆపరేషన్స్, మెయింటెన్స్ డీఈగా ఉన్న శ్రీనివాసులు రాయదుర్గం డీఈగా బదిలీ అయ్యారు. క్వాలిటీ కంట్రోల్ డీఈగా ఉన్న కుసుకుమార్ కర్నూలు క్వాలిటీ కంట్రోల్ డీఈగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో విజయవాడ ఈఎన్‌సీ కార్యాలయం నుంచి రాంగోవిందరెడ్డిని నియమించారు. పుంగనూరు నుంచి కదిరి డీఈగా వెంకటేశ్వర్లు, ఆదోని నుంచి హిందూపురం డీఈగా శివనాగేశ్వరరావును నియమిస్తూ ఈఎన్‌సీ నుంచి ఆదివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇక శింగనమల ఏఈగా ఉన్న శ్రీనివాసులు కుందుర్పికి బదిలీ అయ్యారు. ఆ స్థానంలో నార్పల ఏఈ రవీంద్రనాథ్‌రెడ్డిని నియమించారు. గార్లదిన్నె ఏఈగా ఉన్న కల్యాణిని అనంతపురం డివిజన్ ఏఈగా బదిలీ చేశారు. బుక్కరాయసముద్రం ఏఈగా ఉన్న జనార్దన్‌ను నార్పలకు బదిలీ చేశారు. పుట్లూరు ఏఈగా ఉన్న రామలింగారెడ్డిని గుత్తి ప్రాజెక్ట్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో క్వాలిటీ కంట్రోల్ ఏఈగా ఉన్న ప్రవీణ్‌కుమార్‌ను నియమించారు. అనంతపురం రూరల్ ఏఈగా ఉన్న ఆంజినేయులు పెద్దవడుగూరుకు, ఆత్మకూరు ఏఈగా ఉన్న హరి అనంతపురం రూరల్‌కు వరలక్ష్మిని రాప్తాడుకు, రాప్తాడు ఏఈ వెంకటేష్‌ను పెనుకొండ సబ్‌డివిజన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సిమెంట్ దొంగల సంగతేంటి..?

- వైసీపీ ప్రభుత్వంలో 86 లోడ్లు పక్కదారి
- అమ్మేసి సొమ్ము చేసుకున్న వైనం
- టెండర్ వర్కుల పేరుతో ఇండెంట్
- ఏడాది గడిచినా కదలని విచారణ
- కేసులతోనే సరిపెట్టిన అధికారులు



శ్రీసత్యసాయి జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు కార్యాలయం

అనంతపురం విద్య, సెప్టెంబరు 22 : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావు. టెండర్ వర్కులకు రాయితీ కింద ఇచ్చే సిమెంట్‌ను లారీలకు లారీలు దారి మళ్లించిన ఘనులున్నారు. లక్షలాది రూపాయలు చేతులు మారాయి. నాడు ఉన్నతాధికారుల కళ్లు గప్పి...అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల సమగ్రశిక్ష ప్రాజెక్టు పరిధిలో 86 లోడ్ల సిమెంట్‌ను పక్కదారి పట్టించి సొమ్ము చేసుకున్నారు. నకిలీ లాగిన్స్ ద్వారా టన్నుల కొద్దీ సిమెంట్ అమ్మి సొమ్ము చేసుకున్న ఉద్యోగులపై కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. గత ప్రభుత్వంలో కేసు నమోదైనా... తాజాగా టీడీపీ ప్రజాప్రతినిధుల ద్వారా కలెక్టర్‌ను ప్రసన్నం చేసుకుని ఉద్యోగం పొందాలని చూస్తున్నారని సమాచారం. వైసీపీ హయాంలో కుంభకోణాలు చేసిన వారికి కొందరు ప్రజాప్రతినిధులు సిఫార్సు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏడాదికి పైగా ఈ కేసును అటు అనంతపురం, ఇటు శ్రీసత్యసాయి జిల్లాల విద్యాశాఖాధికారులు, కలెక్టర్లు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

చేయాల్సింది ఇలా...!

ప్రభుత్వం నుంచి టెండర్ వేసిన అభివృద్ధి పనులకు రాయితీపై సిమెంట్ సరఫరా చేస్తారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా సుమారు 40 మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో పలు రకాల పనులతోపాటు, మరో 16 కేజీబీవీ స్కూళ్లు, జూనియర్ కళాశాలల్లో అభివృద్ధి నిర్వహించారు. ఈ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు రాయితీ కింద సిమెంట్‌ను తీసుకోవచ్చు. ఎల్-2 ఆఫీసర్ (ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్) నామినేట్ చేసిన ఎల్-1 ఆఫీసర్ (డివిజనల్ ఇంజనీర్) యూజర్ ఐడీ లాగిన్ ద్వారా కాంట్రాక్టర్ సబ్సిడీ సిమెంట్‌కు ఆన్‌లైన్‌లో పేమెంట్ చేయాల్సి ఉంటుంది. ఎల్-1 నుంచి ఇండెంట్ ఎల్-2కు వచ్చిన తర్వాత దాన్ని ఎల్-2 ఆఫీసర్ తన పైన ఉండే ఎల్-3 ఆఫీసర్ (కలెక్టర్)కు ఇండెంట్ పంపుతారు. ఆ మేరకు ఎల్-3 ఆఫీసర్ ఇండెంట్ సరఫరా చేసేలా వైఎస్ఆర్ నిర్మాణ్ పోర్టల్‌కు పంపుతారు. ఈ ప్రక్రియ పూర్తయితే కాంట్రాక్టర్లు పెట్టుకున్న ఇండెంట్ మేరకు నేరుగా స్కూల్, కళాశాల, లేదా పని జరుగుతున్న ప్రాంతానికి సిమెంట్ సరఫరా చేస్తారు.

కుట్ర చేసింది ఇలా..!

జిల్లాల విభజన సమయంలో సిమెంట్ కుంభకోణానికి బీజం పడింది. అనంతపురం సమగ్రశిక్ష ప్రాజెక్టులో పనిచేస్తున్న ఇద్దరు అవుట్ సోర్సింగ్ సిబ్బంది చక్రం తిప్పినట్టు తెలుస్తోంది. అనంతపురం జిల్లా నుంచి శ్రీసత్యసాయి జిల్లాలో స్కాం సాగించినట్టు తెలుస్తోంది. సిమెంట్ ఇండెంట్ పంపే ఎల్-1, ఎల్-2గా తమ సెల్‌ఫోన్ నెంబర్లతోనే యూజర్ ఐడీ లాగిన్స్ సృష్టించుకున్నారు. తమ సెల్ నెంబర్లను యూజర్ ఐడీ మ్యాపింగ్ చేసుకుని ఉన్నతాధికారులకు తెలియకుండా డబ్బులు కట్టి..సిమెంట్ బుక్ చేసుకుంటూ వచ్చారు. ఇలా 64 సార్లు ఇండెంట్ పంపారు. ఏకంగా 86 లోడ్ల సబ్సిడీ సిమెంట్‌ను రప్పించారు. కేజీబీవీలు, స్కూళ్లలో అప్పటికే పనులు సుమారు 90 శాతం పూర్తయాయ్యయి. సబ్సిడీ కింద తెప్పించుకున్న సిమెంటును అమ్మి సొమ్ము చేసుకున్నట్టు స్పష్టమవుతోంది. ఈ క్రమంలో రూ.13 లక్షల నుంచి రూ.25 లక్షల వరకూ సొమ్ము కొందరు ఉద్యోగుల జేబుల్లోకి చేరినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



అనంతపురం జిల్లా ప్రాజెక్టు కార్యాలయం

కేసులు నమోదు చేసి వదిలేశారా..?

గత ప్రభుత్వంలో సమగ్ర ప్రాజెక్టు పరిధిలో సాగిన ఈ తంతుపై ఉన్నతాధికారుల నుంచి ఫిర్యాదులు వెళ్లడంతో సంబంధిత ఉద్యోగులపై కేసులు నమోదు చేశారు. అనంతపురం నగరంలోని వన్‌టౌన్‌లో 420, 406 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. 2022 మే నుంచి 2023 జూన్ 18వ తేదీ వరకూ ఈ స్కాం సాగినట్టు పోలీసుల విచారణలో తేలింది. ఇద్దరు ఉద్యోగులపై కేసులు నమోదు కావడంతో... సమగ్రశిక్ష ఉన్నతాధికారులు వారిపై వేటు వేశారు. ఏకంగా 86 లోడ్ల సిమెంట్ ఒకే కంపెనీ నుంచి ఒకే ట్రాన్స్‌పోర్ట్ ద్వారా తెప్పించి అమ్మి సొమ్ము చేసుకున్నారు. ఈ స్కాంపై లోతైన దర్యాప్తు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పోస్టింగ్ కోసం పైరవీలు

సిమెంట్ అక్రమాల కేసులో కేసు నమోదయిన ఓ మాజీ ఉద్యోగి మళ్లీ పోస్టింగ్ కోసం ప్రయత్నాలు సాగిస్తున్నట్టు తెలిసింది. వైసీపీ హయాంలో అడ్డగోలుగా సంపాదించి ఉద్యోగం కోల్పోయిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఇప్పుడు టీడీపీ ప్రజాప్రతినిధుల ద్వారా అనంతపురం జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులపై ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. సిమెంట్ కుంభకోణంలో మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా, మింగిన సొమ్ము కక్కించకుండా వదిలేయడంపై అనేక ఆరోపణలు వస్తున్నాయి.

దులీప్ ట్రోఫీ విజేత ఇండియా-ఎ

చివరి మ్యాచ్‌లో రాణించిన బౌలర్లు
డ్రా అనుకున్న పోటీల్లో తేలిన ఫలితం



విన్నర్ ఇండియా-ఎ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 22: దులీప్‌ట్రోఫీ విజేతగా ఇండియా-ఎ జట్టు నిలిచింది. ఆరు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇండియా-ఎ రెండు మ్యాచ్‌లను గెలిచి 12పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. దీంతో విజేత ట్రోఫీని సొంతం చేసుకుంది. అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో 19 నుంచి జరిగిన రెండు మ్యాచ్‌లు ఆదివారం ముగిశాయి. ఏసీజీ-ఏ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో ఇండియా-ఎ, ఇండియా-సి జట్ల మధ్య పోటీ జరిగింది. ఈ మ్యాచ్‌లో ఇండియా-ఎ 132పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. డ్రా అవుతుందనుకున్న మ్యాచ్‌ను బౌలర్లు ప్రసిద్ధ్‌కృష్ణ, తనుష్ కొటియాన్ చెరో 3వికెట్లు, ఆకీబ్‌ఖాన్ 2 రెండు వికెట్లు పడగొట్టి ఇండియా-ఎ జట్టును విజేతగా నిలిపారు. కాగా ఇండియా-సి ఆటగాడు సాయి సుదర్శన్ (117) సెంచరీ వృథా అయ్యింది. మొదటి ఇన్నింగ్స్‌లో 124పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 53పరుగులతో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన షాషావత్ రావత్‌కు ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు దక్కింది.

స్కోరు వివరాలు

ఇండియా-ఎ
మొదటి ఇన్నింగ్స్: 297 పరుగులు
రెండో ఇన్నింగ్స్ 286-6 డిక్లేర్
ఇండియా-సి
తొలి ఇన్నింగ్స్ 234 పరుగులు
రెండో ఇన్నింగ్స్ 217పరుగులు
ఫలితం: 132పరుగుల తేడాతో ఇండియా-ఎ విజయం

సాయి సుదర్శన్ సెంచరీ వృథా

ఓవర్‌నైట్ స్కోర్ 270-6తో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇండియా-ఎ జట్టు మరో 18పరుగులు జోడించి 286-8 వద్ద డిక్లేర్ చేసింది. ఇండియా-సి బౌలర్లు గౌరవ్‌యాదవ్ 4, అన్షుల్‌కాంబోజ్, మానవ్‌సుతార్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం 345 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇండియా-సి జట్టు 81.5ఓవర్లలో 217 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఓపెనర్లు కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ 44పరుగులు, విజయ్‌కుమార్ వైశాక్ 17పరుగులు మాత్రమే సాధించారు. సాయి సుదర్శన్ 206బంతుల్లో 12బౌండరీలతో 111పరుగులు చేశాడు. మిగతా బ్యాటర్లు ఎవరూ రాణించకపోవడంతో ఇండియా-సికి ఓటమి తప్పలేదు.


శతకంతో గెలిపించిన తెలుగుతేజం రికీ భుయ్

దులీప్‌ట్రోఫీలో భాగంగా అనంతపురం క్రికెట్ గ్రౌండ్-బిలో నిర్వహించిన చివరి మ్యాచ్‌లో తెలుగుతేజం రికీ భుయ్ సెంచరీతో జట్టుకు విజయాన్నందించాడు. చివరి మ్యాచ్ ఇండియా- బి, ఇండియా- డి జట్ల మధ్య సాగింది. డ్రాగా ముగుస్తుందనుకున్న మ్యాచ్‌లో ఇండియా- డి బౌలర్లు తమ బౌలింగ్ నైపుణ్యంతో ఫలితం రాబట్టారు.

ఓవర్‌నైట్ స్కోర్ 244-5తో చివరి రోజు ఆదివారం ఇన్నింగ్స్‌ను ఆరంభించిన ఇండియా-డి జట్టు మరో 61పరుగులు జోడించి 305పరుగులు ఆలౌట్ అయ్యింది. 90 పరుగులతో నాలుగో రోజు ఆట ఆరంభించిన తెలుగు తేజం రిక్కీభూయ్ 124బంతుల్లో 15బౌండరీలు, 3సిక్సర్లతో 119పరుగులు సాధించి అజేయంగా నిలిచాడు. ఇండియా-బి బౌలర్లలో ముఖేష్‌కుమార్ 4, నవదీప్ సైనీ 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం 372 భారీ పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇండియా-బి ఏదశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. ప్రధాన బ్యాటర్లు చేతులెత్తేయడంతో 115 పరుగులకే కుప్పకూలింది. ఇందులో నలుగురు బ్యాటర్లు డకౌట్ కావడం గమనార్హం. ఇండియా- డి బౌలర్లు అర్షదీప్ సింగ్ 6, ఆదిత్య థాకరే 4 వికెట్లు పడగొట్టి ఇండియా- బి పతనాన్ని శాసించారు. ఇండియా-డి జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తున్న తెలుగుతేజం రిక్కీ భూయ్ మొదటి ఇన్నింగ్స్‌లో 56, రెండో ఇన్నింగ్స్‌లో 119పరుగులతో నాటౌట్‌గా నిలిచి ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు అందుకున్నారు. ఆరు వికెట్లు పడగొట్టిన ఇండియా- డి బౌలర్ అర్షదీప్ సింగ్‌కు ఉత్తమ బౌలర్ అవార్డు అందజేశారు. రిక్కీభుయ్‌కి బెస్ట్ స్ట్రైకర్ ఆఫ్‌ది సిరీస్ అవార్డు లభించింది. ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సానా సతీష్, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్‌లు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్, జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్‌శర్మ, ఆర్డీఓ వసంతబాబు తదితరులు పాల్గొన్నారు.

స్కోరు వివరాలు

ఇండియా- డి
తొలి ఇన్నింగ్స్: 349పరుగులు,
రెండో ఇన్నింగ్స్‌లో 305
ఇండియా-బి తొలి ఇన్నింగ్స్‌లో 282పరుగులు,
రెండో ఇన్నింగ్స్‌లో 115పరుగులు
ఫలితం: 257 పరుగుల తేడాతో ఇండియా-డి విజయం




ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అన్షుల్ కాంబోజ్, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రావత్



బెస్ట్ స్ట్రయికర్ ఆఫ్ ది సిరీస్ రికీ భుయ్, అర్షదీప్‌సింగ్ (6 వికెట్లు)

రచ్చో రచ్చ!

రెవెన్యూ బదిలీలపై మళ్లీ రగడ
120మందిని ట్రాన్స్‌ఫర్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు
సిఫార్సు లేఖలను పక్కన పెట్టిన జాయింట్ కలెక్టర్
డీటీలు, ఆర్ఐల నియామకాలపై నేతల అసంతృప్తి

అనంతపురం టౌన్, సెప్టెంబరు 22: రెవెన్యూ బదిలీలు ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధుల మధ్య మళ్లీ చిచ్చు రేపుతున్నాయి. మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయ అధికారుల పాత్ర చాలా కీలకం. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు తమకు అనుకూలంగా పనిచేసేవారిని నియమించుకోవాలని చూడటం సర్వసాధారణం. ఈమేరకు బదిలీల సమయంలో జిల్లా ఉన్నతాధికారులకు సిఫార్సు లేఖలు కూడా ఇస్తుంటారు. గత వైసీపీ పాలనలో ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు చెప్పినవారికి జిల్లా ఉన్నతాధికారులు కిమ్మనకుండా పోస్టింగ్ ఇచ్చారు. ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వంలో ఇందుకు విరుద్ధంగా బదిలీల ప్రక్రియ కొనసాగడం రెవెన్యూ అధికారులు, ఉద్యోగ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆదివారానికి సాధారణ బదిలీల ప్రక్రియ ముగిసింది. ఈనేపథ్యంలో జిల్లాలో 120మంది రెవెన్యూ ఉద్యోగుల బదిలీల ఉత్తర్వులను కలెక్టరు విడుదల చేశారు. ఇందులో డిప్యూటీ తహసీల్దార్లు 73మంది, ఆర్ఐలు, సీనియర్ అసిస్టెంట్లు కలిపి 33మంది, జూనియర్ అసిస్టెంట్లు 11మంది, టైపిస్టులు ముగ్గురు ఉన్నారు.

డీటీలు, ఆర్ఐ పోస్టింగ్‌లపైనే వివాదం

రెవెన్యూ బదిలీల్లో డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐల బదిలీలపైనే వివాదం మొదలైందని చర్చించుకుంటున్నారు. అందరూ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు పెట్టాం, కోరుకున్న ప్లేస్‌లకు బదిలీలు వస్తాయని భావిస్తూ వచ్చారు. అయితే అందుకు విరుద్ధంగా బదిలీలలో పోస్టింగ్‌లు వేయడం చూసి అవాక్కయ్యారు. వెంటనే సిఫార్సు లేఖలు ఇచ్చిన ప్రజాప్రతినిధుల వద్దకు క్యూకట్టి బదిలీల వ్యవహారం గురించి వారికి వివరించారు. దీంతో ఆ ప్రజాప్రతినిధులు సైతం ఆశ్చర్యపోయినట్లు తెలిసింది. జిల్లా ఉన్నతాధికారుల తీరుపై ఆ నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈబదిలీలు కలెక్టరు, జేసీల మధ్య కూడా కొంత దూరం పెంచాయని అధికార వర్గాలు చర్చించుకుంటున్నాయి. ప్రజాప్రతినిధుల సిఫార్సులకు కొంత ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టరు సూచించినా అంగీకరించకుండా జాయింట్ కలెక్టర్ ఆలేఖలను పక్కన పెట్టినట్లు సమాచారం. నిబంధనలు, అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్ కింద బదిలీల పోస్టింగ్‌లు ఇచ్చి ఆఫైలును కలెక్టరుకు పంపారని, దానికి కలెక్టర్ ఆమోదం వేసి పంపారని రెవెన్యూవర్గాలలో తీవ్రచర్చ సాగుతోంది. రెవెన్యూ ఉద్యోగుల సంఘం ప్రాధాన్యం పాయింట్లు, ఉమ్మడి జిల్లాల వారిగా సీనియార్టీని కూడా ఈబదిలీలలో పరిగణలోకి తీసుకోలేదని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలోనే ఇటీవల జరిగిన తహసీల్దార్ల నియామ కాల్లో కొందరిని ఆనియోజకవర్గ ప్రజాప్రతినిధులు వ్యతిరేకించారు. దీంతో 8 మంది తహసీల్దార్లు దాదాపు నెలన్నరపాటు ఎక్కడా జాయిన్‌కాకుంగా గాలిలో ఉండాల్సి వచ్చింది. ఆతర్వాత చివరకు వారికి మార్పులు చేసి పోస్టింగ్‌లు ఇవ్వడంతో సమస్య సద్దుమణిగింది. తాజాగా మళ్లీ డీటీలు, ఆర్ఐల బదిలీల వ్యవహారం రగడకు దారితీసింది. ఈపరిస్థితులలో ఎంతమంది జాయిన్ అవుతారో? ఎంతమందిని పెండింగ్‌లో పెడతారో? ఈరచ్చ ఏస్థాయికి వెళుతుందోనన్న ప్రశ్న మొదలైంది.

సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓగా చంద్రశేఖర్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 22: సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓగా ఎ.చంద్రశేఖర్‌ను నియమిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. నెల్లూరు జిల్లా అటవీశాఖ అధికారిగా ఉన్న అయన్ను అనంతపురం సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓగా నియమించారు. ఇప్పటి వరకు ఉన్న చంద్రశేఖర్ ఉద్యోగ విరమణ పొందడంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జ్ బాధ్యతలు వినీత్ కుమార్‌కు అప్పగించిన విషయం తెలిసిందే. క్లియర్ వెకెన్సీ ఉన్న ఆ స్థానానికి డీఎఫ్ఓగా చంద్రశేఖర్‌ను నియమించారు.

పీఆర్ ఎస్ఈగా జహీర్ అస్లాం

అనంతపురం సిటీ, సెప్టెంబరు 22 : ఉమ్మడి జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ ఎస్ఈగా ఎండీ జహీర్ అస్లాం, అనంతపురం పీఆర్ఐ డివిజన్ ఈఈగా జి.ప్రభాకర్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఇదివరకు పీఆర్ ఇన్‌చార్జి ఎస్ఈగా పనిచేస్తున్న కేవీకేవీ ప్రసాద్ పాత స్థానమైన అదే శాఖ పరిధిలోని పీఐయూ ఈఈగా కొనసాగనున్నారు. ఇది వరకు అనంతపురం పీఆర్ఐ డివిజన్ ఈఈగా ఉన్న చంద్రశేఖర్‌ను పార్వతీపురం పీఆర్ఐ డివిజన్‌కు బదిలీ చేశారు. నూతన ఎస్ఈగా నియమితులైన ఎండీ జహీర్ అస్లాం 2019-20లో పీఆర్ఐ అనంతపురం డివిజన్ ఈఈగా పనిచేశారు. ఆ తర్వాత కర్నూలు జిల్లా పీఐయూకు బదిలీ అయ్యారు. అనంతరం జేఎన్‌టీయూలోని ఇంజనీరింగ్ విభాగంలో ఈఈగాగా గత రెండు సంవత్సరాలుగా పనిచేస్తుండగా.. తాజాగా ఈయనకు ఈఈ నుంచి ఎస్ఈగా పదోన్నతి లభించింది. గతంలో ఈయన గతంలో డీఈఈ, జేఈగా కళ్యాణదుర్గం, రాయదుర్గంలో పనిచేశారు. జిల్లాలోని డ్వామాలోని క్యూసీ విభాగంలో అనంతపురం, చిత్తూరు జిల్లాల ఈఈగా పనిచేస్తున్న ప్రభాకర్‌రెడ్డిని తాజాగా పీఆర్ఐ అనంతపురం డివిజన్ ఈఈగా నియమించారు. ఈయన గతంలో కదిరి, కళ్యాణదుర్గం డీఈఈగా పనిచేశారు.

ఆర్‌అండ్‌బీలో పలువురు ఏఈలు, ఏఈఈలు...

అనంతపురం, సిటి, సెప్టెంబరు 22: రోడ్లు భవనాలశాఖ పరిధిలో పనిచేస్తున్న పలువురు ఏఈలు, ఏఈఈలను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
డి.పద్మఏకాంబరలక్ష్మి	అనంతపురం సెక్షన్-3	శింగనమల
ఏ. గోవిందరాజులు	కళ్యాణదుర్గం సెక్షన్-1	కణేకల్లు
ఎస్. హారిక	కనగానపల్లి	ధర్మవరం
పి. శ్రీనివాసులు	క్యూసీ-1 అనంతపురం	గోరంట్ల
వై. ధర్మారెడ్డి	ఎన్‌హెచ్ అనంతపురం	రాజంపేట (లక్కిరెడ్డిపల్లి)
జి. సుజాత	శ్రీసత్యసాయి(డీఆర్‌డీఓ)	కర్నూల్ సర్కిల్ ఆఫీస్
జి. నరసింహామూర్తి	శింగనమల	మడకశిర-1
కె. శ్రావణసంధ్య	కళ్యాణదుర్గం-2	అనంతపురం సర్కిల్
ఎం. వన్నూరుస్వామి	పుట్టపర్తి	పుంగనూరు (చిత్తూరు)
ఎల్. సుజాత	కణేకల్లు	ఎన్‌హెచ్. కదిరి
జి. నాగేంద్రప్రసాద్	డి. హీరేహల్	రాయదుర్గం
ఎస్‌జే ధనలక్ష్మీదేవి	కదిరి ఎన్‌హెచ్	కదిరి
ఎం. నాగేంద్ర	ఎన్‌హెచ్ అనంతపురం	ఎన్‌హెచ్ 234 వీ. కోట
టీ. లక్ష్మీనర్సయ్య	గుత్తి	ఎన్‌హెచ్ ఏటీపీ

ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఐజయ్య

ధర్మవరం: నియోజకవర్గానికి ప్రత్యేకంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఐజయ్యను నియమించామని తిరుపతి ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ రాజారావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐజయ్య నిరంతరం ధర్మవరం కేంద్రంగా మరమగ్గాలపై తనిఖీలు నిర్వహిస్తారని వెల్లడించారు. పవర్‌లూమ్స్ సమస్యలు, పవర్‌లూమ్స్ రిజర్వేషన్ యాక్టు ఉల్లంఘన గురించి ఐజయ్య ఫోన్‌నెంబర్ 7396034586కు సంప్రదించాలన్నారు.

సీటీఓగా కృష్ణవేణి

హిందూపురం, సెప్టెంబరు 22: హిందూపురం వాణిజ్య పన్నులశాఖ అధికారిగా కృష్ణవేణిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న సీటీఓ గోపీనాథ్‌ను గుంతకల్లుకు బదిలీ చేస్తూ అక్కడ పనిచేస్తున్న కృష్ణవేణిని హిందూపురానికి బదిలీ చేశారు. ఒకటి రెండు రోజుల్లో ఆమె బాధ్యతలు చేపట్టనున్నారు.

'పురం' మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాసులు

హిందూపురం, సెప్టెంబరు 22: హిందూపురం మున్సిపల్ కమిషనర్‌గా సంఘం శ్రీనివాసులును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఈయన మడకశిర కమిషనర్‌గా పనిచేశారు.

జిల్లా గ్రామపంచాయతీ అధికారిగా సమత

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 22: జిల్లా గ్రామపంచాయతీ ఆఫీసర్‌గా వై సమతను నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి వెండి యజ్ఞోపవీతం సమర్పణ

గార్లదిన్నె, సెప్టెంబరు 22: మండల పరిధిలోని కోటంక గ్రామ సమీపంలో వెలసిన గుంటిసుబ్రహ్మణ్యేశ్వరస్వామి భక్తులు రూ. 39,900 విలువ చేసే వెండి యజ్ఞోపవీతం సమర్పించి మొక్కు లు తీర్చుకున్నారు. అనంతపురం పట్టణానికి చెందిన ద్వారకా ఈశ్వ రమ్మ కుమారులు కుటుంబ సమేతంగా ఆదివారం వెళ్లి రూ. 39, 900 విలువ చేసే 24.89 గ్రాముల వెండి యజ్ఞోపవీతాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు రామాచార్యులకు అందజేశారు.

వరద బాధితులకు సాయం

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 22: విజయవాడ వరద బాధితుల సహాయార్థ జిల్లా పాస్టర్లు తమవంతుగా రూ.33100 విరాళాన్ని సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేశారు. జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పాస్టర్లు ఆదివారం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంక టేశ్వర ప్రసాద్‌ను కలిసి చెక్కును అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు యెషయా, ఉపాధ్యక్షుడు అనీల్‌కుమార్, కార్యదర్శి వరప్రసాద్, క్రిస్టియన్ మైనార్టీ నాయకుడు స్వామిదాస్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: విజయవాడ వరదబాధితులకు మండలం లోని బసం పల్లి గ్రామస్థులు తమవంతు సహాయం అందించారు. టీడీపీ స్థానిక నాయకులు ఆదివారం రూ.36వేలను ఎమ్మెల్యే పరిటాల సునీతకు మండలంలోని కుంటిమద్దిలో అందజేశారు. నాయకులు బసంపల్లి బయన్న, కిష్టప్ప, పెద్దన్న, నాగరాజు, సుబ్బరాయుడు, సుజాత పాల్గొన్నారు.

నేడు దక్షిణ కాలువకు సాగునీరు విడుదల

గార్లదిన్నె, సెప్టెంబరు 22: మండల పరిధిలోని ఎంపీఆర్ డ్యాం దక్షిణ కాలువకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సోమవారం సా గునీరు విడుదల చేయనున్నట్లు టీడీపీ నాయకులు ఆదివారం తెలి పారు. రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు సాగునీరు విడు దల చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఇది మంచి ప్రభుత్వం కార్య క్రమంలో పాల్గొంటారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమాను లు పెద్ద సంఖ్యలో హజరు కావాలని వారు కోరారు.

గత ఐదేళ్లలో మీరేం చేశారు? : సిమెంట్ పోలన్న

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 22: గత ఐదేళ్లల్లో మీరు ఏం చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని టీడీపీ బీసీ సెల్ నగర అధ్యక్షుడు సిమెంట్ పో లన్న ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. వంద రోజుల్లో వంద పథకాలకు శ్రీకారం చుట్టిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కు తుందన్నారు. అనంత అర్బన్‌లో ఎన్నడూ లేని విధంగా పాలన అందించేందుకు కృషి చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌పై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు.

పారా రైఫిల్ షూటింగ్‌కు రాయలసీమ క్రీడాకారుల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 22: జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శ్రీనగర్‌కాలనీలో ఉన్న ఆర్యన్ షూటింగ్ స్పోర్ట్స్ అకాడమీలో రాయలసీమ స్థాయి పారా క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. క్రీడాకారులు ఆంజనేయులు (కర్నూలు), మస్కట్ (కడప), వెంకటరమణ, చంద్రశేఖర్, బాలాజీ (అనంతపురం) ఎంపికయ్యారు. వారు ఈనెల 29వతేదీన విశాఖపట్నంలో జరిగే మూడో పారా రైఫిల్‌షూటింగ్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో కోచ్ శ్రీకాంత్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

చెస్ గ్రాండ్‌మాస్టర్‌పై ఉదయ్‌కుమార్ విజయం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 22: చెస్ గ్రాండ్ మాస్టర్ తేజ్‌కుమార్‌పై జిల్లాకు చెందిన చెస్ క్రీడాకారుడు ఉదయ్ కుమార్ నాయుడు గెలుపొందారు. బెంగుళూరులో ఆదివారం నిర్వ హించిన చెస్ పోటీల్లో భాగంగా ఏక కాలంలో 30మందితో గ్రాండ్ మాస్టర్ తేజ్‌కుమార్ చెస్ ఆడారు. గ్రాండ్‌మాస్టర్‌పై ముగ్గురు గెలవ గా...27మంది ఓడారు. గెలిచిన క్రీడాకారుల్లో ఒకరైన ఉదయ్‌కుమార్ నాయుడు గెలుపొంది అందరి మన్ననలను పొందాడు. ఆల్ అనంతపూ ర్ చెస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బాలరాజు, అధ్యక్షుడు శివకుమార్ తదితరులు ఉదయ్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు.

టీటీడీలో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

అనంతపురంరూరల్, సెప్టెంబరు22: తిరుమల తిరుపతి దేవస్థానంలో వైసీపీ ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని విశ్వ హిందూ పరిషత్ సభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని ఎ నారాయణపురం నుంచి తపోవనం మీదుగా నగరంలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానం వరకు ర్యాలీ నిర్వహించారు. సభ్యులు హరికిషోర్, కుమ్మర ఓబుల పతి, సుధాకర్, చలపతి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ఓపీఎస్‌ను వెంటనే పునరుద్ధరించాలి'

అనంతపురం విద్య, సెప్టెంబరు 22: ప్రభుత్వాలు వెంటనే సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని ఏపీటీఎఫ్ నా యకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా సదస్సులో తీర్మానం చేశారు. ఉపాధ్యాయభవన్‌లో ఆదివారం ఆ సంఘం 20వ విద్యా వైజ్ఞానిక మహాసభలు నిర్వహించారు. ముందుగా ముఖ్య నాయకు లు, ఉపాధ్యాయులు జెండా ఆవిష్కరించారు. తర్వాత జిల్లా అధ్యక్షు లు శ్రీనివాసరెడ్డి, ప్రధానకార్యదర్శి శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో పలు అంశాలపై చర్చలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్కేయూ ప్రొఫెసర్ బాలసుబ్రహ్మణ్యం, డాక్టర్ రవి శ్రీనివాస్ పలు సూచనలు, సలహాలు చేశారు. పలు అంశాలపై తీర్మానం చేశారు. సంఘం రాష్ట్ర పూర్వపు ప్రధాన కార్యదర్శి కులశేఖర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకట సుబ్బయ్య, రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

● ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 22: రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కరిం చేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే కార్యక్రమా నికి శ్రీకారం చుట్టేదిశగా ప్రణాళిక రూపొం దించేందుకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నిర్మాణ మహాసభలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ పేర్కొన్నారు. అనంతపురం వేదికగా అక్టోబరు 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు. నగరంలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాల యంలో ఆదివారం మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. మహాసభలకు ఎస్ఎఫ్ఐ జాతీయ కార్యదర్శి సాను ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల వారు పా ల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ రజిత, జిల్లా అధ్య క్షుడు సిద్దు, ఉపాధ్యక్షుడు రమేష్, శివ, జిల్లా సహాయ కార్యదర్శులు సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా ఇన్‌చార్జిగా శ్రీనివాసులు రెడ్డి

పుట్టపర్తిరూరల్ : శ్రీసత్యసాయి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా పంట శ్రీనివాసులురెడ్డిని నియమిస్తూ పార్టీ రాష్ట్ర శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి

గార్లదిన్నె, సెప్టెంబరు 22: మండల పరిధిలోని మర్తాడు గ్రామంలో విద్యుదాఘాతంతో యువరైతు షరీఫ్ (35) మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు.. మర్తాడు గ్రామానికి చెందిన మసుద్ కుమారుడు షరీఫ్ వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. తనకున్న మూడు ఎక రాల పొలంలో వరి, వేరుశనగ సాగుచేసేవాడు. ఆదివారం సాయం త్రం పంటకు నీరు పెట్టేందుకు వెళ్లిన షరీఫ్ తోటలో విద్యుదాఘా తానికి గురై మృతి చెందాడు. చుట్టుపక్కల రైతులు గమనించి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించారు. పోలీసులు సంఘగని స్థలాన్ని పరిశీలించారు.

పండమేరు వంకలో దారి ఏర్పాటు

రాప్తాడు, సెప్టెంబరు 22: మండల కేంద్రమైన రాప్తాడు నుంచి చిన్మయ్‌నగర్‌కు వెళ్లే పండమేరు వంక దారిలో హంద్రీనీవా నీరు ప్రవహిస్తుండడటంతో వాహనదారులు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. స్థానికులు ఎమ్మెల్యే పరిటాల సునీతకు విన్నవించారు. మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి ఆధ్వరవ్యంలో సర్పంచ్ సాకే తిరుపాలు, కన్వీనర్ కొండప్ప ఆదివారం పండమేరు వంకలో దారి ఏర్పాటు చేసి వాహనాలు రాకపోకలకు సులభతరం చేశారు.

ఇచ్చిన హామీలను త్వరలో అమలు చేస్తాం

● ఎమ్మెల్యే పరిటాల సునీత



ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

రామగిరి, సెప్టెంబరు 22: ఇచ్చిన హామీలన్నింటిని ఈ ప్రభుత్వం తప్పక అమలు చేస్తుందని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆమె మండలంలో విస్తృతంగా పర్యటించారు. మండలంలోని కుంటిమద్ది, గంగంపల్లి, మా దాపురం, కొత్తగాదికుంట, నసనకోట, దుబ్బార్లపల్లి, తిమ్మాపురం, గరిమేకల పల్లి గ్రామాల్లో రూ.3.60కోట్లతో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణానికి శంకు స్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, కరపత్రాలను అందించారు. అనంతరం ఆయాగ్రామాల్లో పరిటాల శ్రీరామ్ జన్మదిన వేడుకలు నిర్వహించి కేక్‌కట్ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... గత ఐదేళ్ల జగన్ పాలనతో రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఎన్నికల్లో ఇచ్చిన అనేక హామీలను అమలు చేశామన్నా రు. వంద రోజుల్లోనే రాప్తాడు నియోజకవర్గంలో సీసీరోడ్లకు రూ.25కోట్లు తెచ్చామని, గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయన్నారు. టీడీపీ స్థానిక నాయకులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేడు రాప్తాడుకు ఎమ్మెల్యే పరిటాల సునీత రాక

రాప్తాడు: 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పరిటాల సునీత సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటిస్తారని మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు రామినేపల్లి, 11:30కు మైనార్టీ కాలనీ, మధ్యాహ్నం 12:30కు చిన్మయ్‌నగర్‌లో పాల్గొంటారని, సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తారని తెలిపారు. టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మంత్రి నిమ్మలను కలిసిన కలెక్టర్, జేసీ



మంత్రి నిమ్మలకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్, జేసీ

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 22 : రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ శివనారాయణ శర్మ మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా పర్యట నకు ఆదివారం వచ్చిన మంత్రిని స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో కలెక్టర్, జేసీలు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

వంకల పునరుద్ధరణకు నిధులివ్వండి: ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్ : నియోజకవర్గంలోని ప్రజలకు ఇబ్బందికరంగా మారిన నడిమి వంక, మరువ వంక పునరుద్ధరణకు నిధులు మంజూరు చేయాలని మంత్రి నిమ్మల రామానాయుడును ఎమ్మెల్యే దగ్గుపాటి వెంక టేశ్వర ప్రసాద్ కోరారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆది వారం మంత్రి నిమ్మలను ఎమ్మెల్యే కలిసి వినతి పత్రం అందించారు. పునరుద్ధర ణ పనులకు రూ.124 కోట్లు ఖర్చు అంచనా వేసినట్లు తెలిపారు.

నీటి సమస్య పరిష్కరించండి: ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

గార్లదిన్నె : శింగనమల నియోజకవర్గంలో నీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ కోరారు. ఆమె ఆదివారం జిల్లాకు వచ్చిన మంత్రి నిమ్మలను కలిసి, పూలమొక్క అందచేశారు. శింగనమల నియోజకవర్గంలో నీటి సమస్యపై మంత్రితో మాట్లాడారు.

ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి

● జలవనరుల శాఖ ఏఈఈల సంఘం వినతి

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 22: జలవనరుల శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల సంఘం నాయకులు కోరారు. జిల్లాకు ఆదివారం వచ్చిన మంత్రి నిమ్మల రామానాయుడును స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అర్హులైన ఇంజనీర్లు, ఉద్యోగు లందరికీ పదోన్నతులు కల్పించాలని, ఖాళీలను భర్తీ చేసి పని ఒత్తిడి తగ్గించాలి తెలిపారు. సంఘం నాయకులు తరుణ్‌కుమార్ రెడ్డి, జీవన్, సుధాకర్, ఓబుళరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రైతుకు ముంటిమడుగు చేయూత

గార్లదిన్నె, సెప్టెంబరు 22 : టీడీపీ కార్యకర్తకు నియోజకవర్గం టు మెన్ కమిటి సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి, మాజీ ఎంపీపీ ముంటి మడుగు శ్రీనివాస్‌రెడ్డి మామిడి మొక్కలు అందించి చేయూత నిచ్చారు. మండలం కనుంపల్లికి చెందిన కుమార్ అనే రైతుకు ముంటిమడుగు సో దరులు సొంత డబ్బుతో ఆదివారం 150 మామిడి మొక్కలు అందజేశారు.

బీసీ హాస్టల్‌ను తనిఖీ చేసిన మంత్రి సవిత



విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 22: నగరంలోని అరవింద నగర్‌లో ఉన్న బీసీ బాలికల వసతి గృహాన్ని ఆదివారం రాత్రి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి విద్యార్థులతో మాట్లాడారు. పేద పిల్ల లు చదువుకునే వసతి గృహాల్లో భోజనం, ఇతర సదుపాయలు సక్రమంగా ఉండేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఎక్కడైనా తప్పిదాలు జరిగితే ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అలాగే గుండెపోటుతో ఇటీవల మృతి చెందిన కెమెరామన్ శేఖర్ కుటుంబ సభ్యులను మంత్రి సవిత ఆదివారం పరామర్శించారు. నగరంలోని శేఖర్ ఇంటికి ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌తో కలిసి వెళ్లారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. శేఖర్ భార్యకు మంత్రి సవిత రూ.లక్ష చెక్కును అందించారు. మృతుని భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించి ఆదుకోవాలని ఎమ్మెల్యే కోరగా ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు.

కొనసాగిన డాక్టర్ల ఆందోళన

అనంతపురం టౌన్, సెప్టెంబరు22: తమకు అన్యాయం జరిగే జీఓ 85ను వెంటనే రద్దు చేసుకోవాలంటూ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలలో పనిచేస్తున్న డాక్టర్లు చేపడుతున్న ఆందోళన రెండోరోజు కొనసాగింది. డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన దీక్ష ఆదివారం కొనసా గించారు. ఆ జీఓను రద్దు చేసుకునేంతవరకు మాపోరాటం సాగిస్తామని హెచ్చరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డితో పాటు 45 పీహెచ్‌సీల పరిధిలోని 105మంది డాక్టర్లు ఈ ఆందోళనలో పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా కార్డెన్ సెర్చ్

అనంతపురం క్రైం, సెప్టెంబరు 22 : జిల్లా వ్యాప్తంగా ఆదివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టినట్లు పోలీసు వర్గాలు పేర్కొన్నారు. పాత నేరస్థులు, రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. అనుమానాస్పద ఇళ్లలో తనఖీలు చేశారు. పలుగ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రశాంతమైన జీవనాన్ని సాగించాలని అవగాహన కల్పించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదుచేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. సమస్యాత్మకమైన వ్యక్తులపై నిత్యం నిఘాఉంటుందని తెలిపారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం పరిసర ప్రాంతాల్లో కర్ణాటక టెట్రా ప్యాకెట్లను అమ్ముతున్న వారిని పట్టుకుని నిర్వాహకుడపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. జిల్లాను ప్రశాంతంగా ఉంచేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని కోరారు.

సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

● ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

నార్పల, సెప్టెంబరు22: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఒక్క సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. మండలంలోని చామలూరులో ఆదివారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభు త్వం' కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు హాజరయ్యారు. గ్రామంలోని పలు సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆలం వెంకట నరసానాయుడు, మాజీ ఎంపీపీ ఆకుల అరుణ, ఆకుల ఆంజనే యులు, ఆకుల విజయ్‌కుమార్‌బాబు, ప్రతాప్‌చౌదరి, జాఫర్‌వలి, ఆకుల తేజ, ఆలంనాగార్జుననాయుడుతదితరులు పాల్గొన్నారు.

అనంతపురంరూరల్: మండలంలోని పాపంపేటలో అధికారులు, టీడీపీ నాయకులు ఆదివారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. పీఆర్‌జేఈ శ్రీనివాసులురెడ్డి, పంచాయతీ కార్యదర్శి అశోక్ బాబు, సచివాలయం కార్యదర్శి మహేంద్రరెడ్డి, మాజీ జడ్పీటీసీ వేణు గోపాల్, టీడీపీనాయకులు రామాంజినేయులు, బాబావలి, రత్నమోహన్, అల్లీపీరా, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు: మండలంలోని బొమ్మేపర్తి గ్రామంలో ఆదివారం నిర్వహిం చిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో రాప్తాడు నియోజకవర్గ ప్రత్యేక అధికారి మురళికృష్ణ పాల్గొన్నారు. ఎంపీడీఓ సాల్మన్‌రాజ్, స్థానిక అధికారులతో కలిసి ఇంటింటా పర్యటించి కార్యక్రమ ఉద్దేశం వివరించారు. స్టిక్కర్లను ప్రజలకు పంచారు. టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప, పంచాయతీ కార్యదర్శి రామచంద్రారెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్ల కార్యవర్గం ఎన్నిక

అనంతపురం విద్య, సెప్టెంబరు 22: అనంతపురం జిల్లా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (ఏడీపీఎస్ఏ)కు కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రఘు సైనిక్ స్కూల్‌లో ఆ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ వెంకట్రామిరెడ్డి హాజరై మాట్లాడారు. ప్రైవేట్ స్కూళ్లలో ఉన్నతమైన, నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మనోరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో కరస్పాండెంట్లకు హెల్త్ చెకప్ నిర్వహిం చారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షు డిగా గంగాధర్ యాదవ్, అధ్యక్షుడిగా గోపాల్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శిగా రమణారెడ్డి, కోశాధికారిగా రామ చంద్ర, సీఆర్వోగా రవిచంద్రారెడ్డి, ఉపాధ్యక్షులుగా శ్రీవాత్సవ, నగర అధ్యక్షు లుగా భాస్కర్‌రెడ్డి, ఇతర సభ్యులుగా మరికొందరిని ఎన్నుకున్నారు.

అర్బన్ బ్యాంకు సేవలను విస్తృతం చేస్తాం

మహాజనసభలో చైర్మన్ జేఎల్ మురళీధర్



మాట్లాడుతున్న అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 22: ఉన్నోళ్లకే పరిమితమైన టౌన్ బ్యాంకును పేదలకు విరివిగా రుణాలు అందిస్తూ అర్బన్‌బ్యాంకుగా రూపాం తరం సాధించామని బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్ పేర్కొన్నారు. ఆది వారం స్థానిక సుభాష్‌రోడ్డులోని శ్రీకృష్ణదేవరాయభవన్‌లో అర్బన్ బ్యాంకు 108వ మహాజనసభ నిర్వహించారు. మొదట బ్యాంకు సీఈఓ విజయభాస్కర్ 2023-24కు సంబంధిం చి వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా బ్యాంకు శాఖలను ఏర్పాటు చేసి కమర్షియల్ బ్యాంకు లకు దీటుగా అన్ని రకాల సేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు వైస్‌చైర్మన్లు వెంకటాద్రి, బంగారు బాషా, పాలకవర్గ సభ్యులు రమణ య్య, కృష్ణమోహన్, రామాంజనేయులు, చంద్రశేఖర్, భాస్కర్, రమేష్, చింతా భాస్కర్ పాల్గొన్నారు.



రామగిరిలో వేడుకలు చేసుకుంటున్న టీడీపీ శ్రేణులు



రాప్తాడులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు



వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న కన్వీనర్, డీలర్లు



అన్నదానం చేస్తున్న బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్లు

ఘనంగా శ్రీరామ్ జన్మదిన వేడుకలు

రామగిరి, సెప్టెంబరు 22: టీడీపీ ధర్మవరం నియోజకవర్గఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ జన్మదిన వేడుకలను ఆదివారం టీడీపీ నాయకులు, అభి మానులు ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యంగా రాప్తాడు, ధర్మవరం నియో జకవర్గాల్లో పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహించి, పరిటాలశ్రీరామ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ...పలు ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అన్ని మండలాల్లో కేక్ కట్ చేశారు. నసనకోట బాలికల గురుకుల పాఠశాల వి ద్యార్థినుల సౌకర్యార్థం రూ.లక్ష విలువైన టీవీ, గ్యాస్ స్టౌలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే పరిటాల సునీత స్వయంగా పాల్గొని విద్యార్థుల సమక్షంలో వేడుకలను జరిపారు. ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లో కూటమి గెలుపులో శ్రీరామ్ కీలక పాత్ర వహించారని ఆయన నా యక త్వంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. అలాగే టీడీపీ రామగిరి కార్యాల యంలో అభిమానులు పరిటాల శ్రీరామ్ ఫ్లెక్సీ వద్ద భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుబ్బరాయుడు, ఎస్ ఆంజనే యులు, బి వెంకటేష్, వడ్డిసుబ్బు, బోయ రామాంజినేయులు, శ్రీనివాసులు, చెన్నకేశవులు, చిత్తరంజన్, చిన్నఅక్కులప్ప, నాగరాజు, వడ్డి పెద్దాయప్ప, హనుమంతు, నాగరాజు, వడ్డిరాజు, నారాయణ, రైటర్ కదిరెప్ప పాల్గొన్నారు.

రాప్తాడు: పరిటాల శ్రీరామ్ జన్మదిన వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ స్థానిక కార్యాలయంలో భారీ కేక్ కట్ చేశారు. పరి టాల రవీంద్ర ఆశయ సాధన కోసం పరిటాల శ్రీరామ్ ఎంతో కృషి చేస్తున్నా రని అన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పంపు కొండప్ప, ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి శ్రీనివాసులు, సర్పంచులు సాకే తిరుపాలు, మిడతల శీనయ్య, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గెజ్జల నారాయణస్వామి, ఎంపీటీసీలు జాఫర్, రవి, మాజీ కన్వీనర్ నారాయణస్వామి, మరూరు గోపాల్, పంపు ఇంద్ర, గోనిపట్ల శీనా, బీరన్న, రామినేపల్లి శ్రీనివాసులు, రాము, బుడగ రాజు, సాకే అనిల్, ప్రతాప్, వాటర్‌షెడ్ చైర్మన్లు మల్లికార్జున, యోగేంద్ర, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు ముత్యాలప్ప, గడ్డం ముత్యాలప్ప, ఫీల్డ్ అసిస్టెంట్‌ల సంఘం అధ్యక్షుడు తలారి శివ, ఫీల్డ్ అసిస్టెంట్‌లు సుధాకర్, మధు, ఉజ్జినే శ్వర, వినోద్, రాము తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం: పరిటాల శ్రీరామ్ జన్మదినం సందర్భంగా మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు కాట్నేకాల్వ వృద్ధాశ్రమంలో, మండల కన్వీనర్ పంపు కొండప్ప ఆధ్వర్యంలో డీలర్లు ఆదివారం అన్నదానం చేశారు. డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు దండు నరేంద్ర, సూరి, రవి, మద్ది లేటి, వెంకీ, అశ్వత్థ నారాయణ, లక్ష్మీనారాయణ, సునీల్, అమర్‌నాథ్‌రెడ్డి, బాషాబా య్, మహ మ్మద్ అలి, దాదులూరయ్య, నారాయణస్వామి, ఎర్రప్ప, చంద్రాయుడు, రాము, గంగాధర్, గోపాల్, నాగరాజు, చంద్రశేఖర్, ఆదెప్ప, నరసింహులు, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.



రామగిరి పాఠశాలలో విద్యార్థులకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

బీసీ నాయకుల ఆధ్వర్యంలో... యువనేత పరిటాల శ్రీరామ్ జన్మదినం సందర్భంగా టీడీపీ బీసీ సాధికార సమితుల రాష్ట్ర కన్వీనర్లు ఆదివారం అన్న దానం చేశారు. కుమ్మర శాలి వాహన రాష్ట్ర కన్వీనర్ మదానపు పోతులయ్య, గాండ్ల రాష్ట్ర కన్వీనర్ గాండ్ల విశాలాక్షి, వడ్డెర్ల రాష్ట్ర కన్వీనర్ వడ్డే వెంక టేష్, కురుబ రాష్ట్ర కన్వీనర్ గంగలకుంట రమణ అనంతపురం ప్రభుత్వాసు పత్రి వద్ద అన్నదానం చేశారు. నాయకులు వెంకటనారాయణ, వన్నూర్ స్వామి, కేవీ రమణ; రామాంజినేయులు, నాయక్, రాజా పాల్గొన్నారు.

కనగానపల్లి: పరిటాల శ్రీరామ్ జన్మదిన వేడుకలను మండల వ్యాప్తంగా టీడీపీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక పరిటాల భవనంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, నియోజకవర్గ కో ఆర్డినేటర్ బోయ పాటి సుధాకర్‌చౌదరి, మండల కన్వీనర్ యాతం పోతలయ్య, సర్పంచ్ సోమరచంద్రశేఖర్, తెలుగుయువత బట్టా సురేశ్‌చౌదరి ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ బిల్లేదామోదర్, పూజారి రాజాక్రిష్ణ, నాయకులు వడ్డే నాగభూషణం, శివానంద, రాజశేఖర్, రాము, బట్టా తిరుపాలు, మద్దెల చెరువు శివకుమార్, శివయ్య, మారుతి, సురేశ్‌యాదవ్, పల్లా ఆనంద్, గొంత పల్లి సుధాకర్, వేపకుంట రామలింగ, శేషు, బాలెపాలెం వెంకట నారాయణ, కాశీపతి తదితరులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: యువనేత పరిటాలశ్రీరామ్ జన్మదిన వేడుకలను మండ లంలో ఆదివారం టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. చెన్నేకొత్తపల్లి లోని బస్టాండ్ ఆవరణంలో టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి ఆధ్వ ర్యంలో కేక్ కట్ చేశారు. మాజీఎంపీపీ అంకే అమరేం ద్ర, యజ్ఞేశంకర్, ఏపీ శ్రీనివాసులు, మాడెం సూర్యనారాయణరెడ్డి, హరినాథరెడ్డి, కాన శివా రెడ్డి, రామస్వామి, నారాయణరెడ్డి, శివ, మాడెం పల్లెన్న, అశ్వత్థరెడ్డి, బండి ఆంజనే యులు, అమరేంద్రరెడ్డి, మాడెం ఓబిరెడ్డి, బన్యాల సూర్యనారాయణ, ఉత్తకు మారరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంరూరల్: పరిటాల శ్రీరామ్ జన్మదిన వేడుకలను మండ లంలో ఘనం నిర్వహించారు. టీడీపీ మండల కన్వీనర్ జింకా సూర్యనారా యణ, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, క్లస్టర్ ఇన్‌చార్జ్ రాగేమురళి, మండల వైస్ కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, మన్నీల సర్పంచు త్రిలోక్‌నాయుడు తదితరులు ఇటుకలపల్లిలో కేక్‌కట్ చేశారు. సోములదొడ్డిలో మండల ప్రధాన కార్యదర్శి పాములరాయి రఘు ఆధ్వర్యంలో, ఎన్ఆర్ కాలనీలో తెలుగు రైతు మండల అధ్యక్షులు నారాయణస్వామి, శ్రీ సత్యసాయిజిల్లా కుమ్మర సాధికార కన్వీనర్ ప్రదీప్, వెంకటరాముడు తదితరులు కేక్‌కట్ చేశారు. చియ్యేడు గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి, రూ.20 వేల క్రికెట్ కిట్లు అందజేశారు. చంద్రాయుడు, ప్రసాదు, రామ్మూర్తి, చెన్నయ్య, పరమేశ్వర్‌రెడ్డి, సుబ్బరాయుడు, వెం కటరాముడు రవి తదిత రులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ నాయకులు యు రమణ ఆధ్వర్యంలో రమణకొట్టాల్లో కేక్ కట్ చేశారు. ఈకార్యక్రమంలో కుమ్మర రా మాంజినే యులు, అల్లీపీరా, తాడాల నాగభూషణం, కందుకూరు బాలకృష్ణ, డీలర్లు సాంబశివ, బాబావలి, నారాఅనంతయ్య, టపాల చిన్నరాజు, కప్పల రాము, వెంకట్‌రాముడు, తిరుపాలు, ఓబుళపతి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలో ఆదివారం పరిటాల శ్రీరామ్ జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ కార్యా లయం వద్ద కేక్‌ను కట్‌చేశారు.



కురుగుంటలో కేక్ కట్‌చేస్తున్న టీడీపీ నాయకులు



ఎన్ఆర్‌కాలనీలో కురుగుంట నారాయణస్వామి తదితరులు



ఇటుకలపల్లిలో జింకా సూర్యనారాయణ ఆధ్వర్యంలో...



సోములదొడ్డిలో పాములరాయి రఘు ఆధ్వర్యంలో...



సీకేపల్లి బస్టాండ్ వద్ద కేక్‌కట్ చేస్తున్న టీడీపీ శ్రేణులు



కనగానపల్లి టీడీపీ కార్యాలయంలో...





చియ్యేడులో క్రికెట్ కిట్ అందజేస్తున్న లక్ష్మీనారాయణ, రమణకొట్టాల్లో కేక్‌కట్ చేస్తున్న దృశ్యం

పదిమంది పేకాటరాయుళ్ల అరెస్టు

● రూ. 10,52,550 నగదు స్వాధీనం

కూడేరు, సెప్టెంబరు 22: మండలంలోని శివరాంపేట గ్రామ సమీపంలో శనివారం పేకాట స్థావరంపై సీఐ శివరాముడు, సిబ్బంది దాడులు చేశారు. అక్కడ పేకాటాడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.10,52,550 నగదుతోపాటు 3 ద్విచక్రవాహనాలు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరందరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మండలంలో పేకాటరాయుళ్ల నుంచి ఇంత పెద్ద ఎత్తున నగదు స్వాధీనం చేసుకోవడం ఇదే మొదటిసారి.

రాయలచెరువులో ఆరుగురు..

యాడికి: రాయలచెరువు గ్రామం వద్ద ఆరుమంది పేకాటరాయుళ్లను ఆదివారం అరెస్ట్‌చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. రాయలచెరువు గ్రామసమీపాన ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద చింత తోపులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు చేశామని, అక్కడ పేకాటాడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసి వారివద్ద నుంచి రూ.7240 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

భర్త దాడిలో భార్యకు గాయాలు

గుత్తిరూరల్, సెప్టెంబరు 22: మండలంలోని అబ్బేదొడ్డి గ్రామానికి చెందిన గోపాల్ అనే వ్యక్తి భార్య సుమలతపై దాడి చేసి గాయపరిచాడు. గ్రామానికి చెం దిన గోపాల్, సుమలత భార్యా భర్తలు. కాగా వారు ఆదివారం తెల్లవారుజామున ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో తీవ్ర ఆగ్రహానికి గురైన భర్త గోపాల్ కొట్టడంతో భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి ఆమెను గుత్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

90.6మి.మీ.ల వర్షపాతం

గుత్తి, సెప్టెంబరు 22: పట్టణంలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. సుమారుగా 90.6 మిమీల వర్షపాతం నమోదైనట్లు అధికారులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. భారీ వర్షానికి గుత్తిఆర్‌ఎస్‌లోని గౌతమేశ్వర స్వామి దేవస్థానం ప్రహరీ కూలిపోయింది.

విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి

పామిడి, సెప్టెంబరు 22 : మండలంలోని కండ్లపల్లి గ్రామంలో ఆదివారం విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందింది. గ్రామంలోని సుదర్శన్ ఇంటి వద్ద మరమ్మతుల కోసం పక్కనే ఉన్న పెన్నానదిలో ఇసుక కోసం వెళ్లాడు. ఇసుకను ఎద్దులబండిలో నింపుకొని వస్తుండగా గాలికి తెగి పడిన స్టే వైర్‌ను ఎద్దు తొక్కింది. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో సుమారు రూ. 60వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

వ్యక్తికి తీవ్రగాయాలు

కళ్యాణదుర్గంరూరల్, సెప్టెంబరు 22: మండల ంలోని గరుడాపురం గ్రామంలో గల ఓ వ్యవసాయ పొలంలో ఆదివారం ప్రైవేట్ విద్యుత్ కార్మికుడు లోకేష్ విద్యుత్ స్తంభంపై మరమ్మతులు చేస్తుండగా షాక్ గురై కింద పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విద్యుత్ స్తంభంపై మరమ్మతులు చేస్తున్న సమయంలో విద్యుత్ సరఫరా కావడంతోనే ప్రమాదం జరిగి ఉంటుందని తెలుస్తోంది. నిజానికి పోల్ టు పోల్ లైన్‌మెన్ మరమ్మతులు చేయాల్సి ఉంది. కానీ ఓ ప్రైవేటు వ్యక్తిని విద్యుత్ స్తంభంపైకి ఎక్కించి మరమ్మతులు చేయించడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మెచ్చిరిలో కార్డెన్ సెర్చ్

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 22: మండలంలోని మెచ్చిరి గ్రామంలో ఆదివారం రాయదుర్గం పట్టణ పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ జయనాయక్ తొలుత సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడుతూ ఎవరూ గొడవలు పడకుండా ప్రశాంతమైన వాతావరణంలో జీవనాన్ని గడపాలని సూచించారు. ఏదైనా సమస్య వస్తే సామరస్యంగా పరిష్కరించుకోవాలని తెలిపారు. తర్వాత అనుమానితుల ఇళ్లల్లో తనిఖీలు చేపట్టారు.

కల్యంలో..

డీ.హీరేహాళ్, సెప్టెంబరు 22: మండలంలోని కల్యం గ్రామంలో రూరల్ సీఐ వెంకటరమణ సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానితుల ఇళ్లల్లో తనిఖీలు చేపట్టారు. రాయదుర్గం రూరల్, సర్కిల్ ఎస్‌ఐలు కణేకల్లు, బొమ్మనహాళ్, గుమ్మఘట్ట, డీ.హీరేహాళ్ పోలీస్‌స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

పామిడి, సెప్టెంబరు 22 : మండలంలోని రామగిరి దిగువతండా గ్రామంలో ఆదివారం సీఐ యుగంధర్ భారీ బెల్లం ఊటను ధ్వంసం చేశారు. గ్రామ సమీపాన అటవీ ప్రాంతంలో పలుచోట్ల నాటుసారా తయారీకి సిద్ధంగా ఉన్న 800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు రవీంద్ర, సురేష్, రుబినయ్య, క్రాంతి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెరువులను హెచ్చెల్సీ నీటితో నింపండి

పుట్లూరు, సెప్టెంబరు 22: మండలంలోని మూడు చెరువులను హెచ్చెల్సీ నీటితో నింపాలని రైతు సంఘం నాయకుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని బ్రహ్మంగారి ఆలయం వద్ద ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చెరువులను నీటితో నింపితే భూగర్భజలాలు పెరిగి బోర్లలో నీరు సమృద్ధిగా వస్తాయన్నారు. అధికారులు స్పందించి సముద్రంలోకి వెళ్లే వృథా నీటిని మళ్లించాలని కోరారు. సమావేశంలో నాయకులు సత్తార్ గోపాల్, బాలగురయ్య తదితరులు పాల్గొన్నారు.

సగర సంఘం కార్యవర్గం ఎన్నిక

పామిడి, సెప్టెంబరు 22: పట్టణంలోని సరస్వతీ విద్యా మందిరం వద్ద గల ఓ భవనంలో ఆదివారం సగర సంఘం ఆత్మీయ సమావేశం జరిగింది. ఇందులో సగర సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా వెంకటనారాయణ, అధ్యక్షుడిగా చిలకల రాజగోపాల్, ఉపాధ్యక్షులుగా లీలమనోహర్, హరికృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శి గా రాఘవేంద్ర, కార్యదర్శిగా వెంకటరాముడు, కోశాధికారిగా విశ్వనాథ్, కార్యవర్గ సభ్యులుగా మస్తానయ్య, దేవరపల్లి సూరి, ఓబుళపతి, రామకృష్ణ, దేవరాజును ఎన్నుకున్నారు. అధ్యక్షుడు చిలకల రాజగోపాల్ మాట్లాడుతూ... పట్టణంలో భగీరథ విగ్రహ ఏర్పాటుకు, కల్యాణ మండపం నిర్మాణానికి స్థలం కేటాయింపునకు కృషి చేస్తానని తెలిపారు. నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధికి, తగిన సహాయ సహకారాలు అందజేస్తామని పేర్కొన్నారు.



అధ్యక్షుడు రాజగోపాల్‌ను సన్మానిస్తున్న సగరులు

అన్ని పథకాలూ త్వరలోనే అమలవుతాయి

● ఇదిమంచి ప్రభుత్వంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



గుంతకల్లులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యే



రాయదుర్గంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ

గుంతకల్లు/ గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 22: ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు ప్రకటించిన పథకాలన్నీ ఒక్కొక్కటిగా త్వరలోనే అమలవుతాయని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. పట్టణంలోని 18, 2వ వార్డుల్లో ఆదివారం సాయంత్రం చేపట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. 18వ వార్డు లో ఇన్‌చార్జి సరోజమ్మ నేతృత్వంలో కరపత్రాలను స్థానిక ప్రజలకు అందజేసి ప్రభుత్వ పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ముందు ప్రకటించిన హామీలన్నీ తప్పనిసరిగా అమలౌతాయని పేర్కొన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నా యకులు గుమ్మనూరు నారాయణస్వామి, బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, తలారి మస్తానప్ప తదితరులు పాల్గొన్నారు. 20వ వార్డులో టీడీపీ కౌన్సిలర్ ఆర్ పవన్‌కుమార్ గౌడ్ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ ప్రజలకు వందరోజుల్లో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు హలీం, గణేష్, మోహన్, నవీన్, అవినాష్, ప్రవీణ్, పాల్గొన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనం

రాయదుర్గంటౌన్: వైఎస్ జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయిందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విమర్శించారు. పట్టణంలోని 13వ వార్డులో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పసుపులేటి రాజు ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. గత వైసీపీ పాలనలో వైఎస్ జగన్ నియంత పాలనతో, అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. చంద్రబాబు వచ్చాక మళ్లీ గాడిన పడుతోందన్నారు. అలాగే దేశ విదేశాల్లో ఉండే పెట్టుబడిదారులను, పారిశ్రామిక వేత్తలను రాష్ట్రానికి రప్పించి పరిశ్రమలు ఏర్పాటుకు సీఎం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ గార్మెంట్ పరిశ్రమకు పూర్వ వైభవాన్ని తీసుకు వచ్చేందుకు కృషి చేస్తామన్నారు. డీ.హీరేహాళ్, బొమ్మనహాళ్ మండలాల్లో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, టీడీపీ నేతలు టంకశాల హనుమంతు, మహబూబ్‌బాషా, వెంకటేష్, రాయదుర్గం మండల కన్వీనర్ హనుమంతు, గుమ్మఘట్ట మండల కన్వీనర్ కాలవ సన్నన్న తదితరులు పాల్గొన్నారు.

ఇది మంచి ప్రభుత్వంపై ఇంటింటా ప్రచారం

యాడికి: మండలకేంద్రంలో కూటమి నాయకులు, అధి కారులు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటై వందరోజులు అయిందని, ఇంత తక్కువ కాలంలోనే సీఎం చంద్రబాబు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని ప్రజలకు తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని పథకాలను అమలు చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, జనసేన మండల కన్వీనర్ సునీల్‌కుమార్, బీజేపీ నియోజకవర్గ కో కన్వీనర్ గంగాధర, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆదినారాయణ, తెలుగు మహిళా మండల అధ్యక్షురాలు అనిత, మాజీ ఎంపీటీసీ ఆదినారాయణ, నాయకులు తాంద్ర విక్రమ్, సుబ్బారెడ్డి, గన్నె రమేష్, చంద్రశేఖర్, సుభహాన్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: మున్సిపాలిటీలోని 1వవార్డులో గల చెట్నేపల్లిలో ఇదిమంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. తొలుత స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి, నాయకులు వాల్మీకి రమేష్, కుమార్, న్యాయవాది సోమశేఖర్, ప్రతాప్, చికెన్‌శీనా, సుంకన్న, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్ కృష్ణ, రమణ , అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్, శ్రీధరఘట్ట, దర్గాహోన్నూరు తదితర గ్రామాలలో ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, నాయకులు నవీన్, సంగప్ప, సల్లాపురం బాబు, మాజీ సర్పంచ్ కేశప్ప, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాగరాజు, వీఎల్ రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి శివన్న, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కురుబలు ఐక్యత చాటాలి

● సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు పిలుపు

కళ్యాణదుర్గం (కంబదూరు), సెప్టెంబరు 22: కంబదూరు మండల కేంద్రంలోని కమల మల్లేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఆదివారం కురుబ సంఘం మండలాధ్యక్షుడు వెంకటంపల్లి రామకృష్ణ అధ్యక్షతన కురుబ కుల సమావేశం జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు, కళ్యాణదుర్గం నియోజకవర్గ అధ్యక్షుడు కామక్కపల్లి నాగరాజు, ప్రధాన కార్యదర్శి కురుగౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బోరంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ.. కురుబలు ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. అలాగే రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని సూచించారు. అప్పుడే ప్రతి రాజకీయ పార్టీ గుర్తిస్తుందని అన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గ కేంద్రంలో కనకదాసు కళ్యాణ మండపంతో పాటు విగ్రహాన్ని నెలకొల్పటకు కార్యాచరణ చేయనున్నామని చెప్పారు. ప్రతి గ్రామంలో కమిటీలను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం కళ్యాణదుర్గం పట్టణ పూర్వ సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, రూరల్ అధ్యక్షుడు గోళ్ల రాము, శెట్టూరు మండలాధ్యక్షుడు చిన్నంపల్లి నాగరాజు, బ్రహ్మసముద్రం మండల అధ్యక్షుడు వేపులపర్తి నాగరాజు జిల్లా ఉపాధ్యక్షుడు వేపులపర్తి హనుమంతు, కార్యదర్శి గుల్యం పోతన్న, మండలంలోని కురుబలు పాల్గొన్నారు.



కంబదూరు సమావేశంలో పాల్గొన్న కురుబలు

రాజకీయంగా ఎదగాలి

గుంతకల్లుటౌన్: కురుబలు రాజకీయంగా ఎదగాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పిలుపునిచ్చారు. పట్టణంలోని గుంతకల్లప్ప స్వామి కల్యాణమండపంలో ఆదివారం గుంతకల్లు నియోజకవర్గ కురుబ సంఘం నాయకులు ఎంపీ, ఎమ్మెల్యేకు ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ కురుబల సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు. కురుబలు రాజకీయంగా ఎదగాలన్నారు. తర్వాత కురుబల సమస్యలను పరిష్కరించాలని పలువురు వారికి వినతి పత్రాన్ని అందజేశారు. కురుబ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సోమశేఖర్, మల్లికార్జున, టీడీపీ కురుబ సాధికార పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు కురుబ చంద్రశేఖర్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జగదీష్, టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీసంప్రదాయాలను మరువరాదు



తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న బీజేపీ జాతీయ నాయకుడు

ఉరవకొండ, సెప్టెంబరు 22: మన సంస్కృతీ సంప్రదాయాలను మరువరాదని బీజేపీ జాతీయ నాయకుడు నినావత్ బిక్కునాయక్ సూచించారు. వజ్రకరూరు మండలంలోని వెంకటాంపల్లి తండాలో జరుగుతున్న తీజ్ ఉత్సవాల్లో ఆదివారం ఆయన పాల్గొన్నారు. బంజారాలు ఆయనకు సాంప్రదాయ ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన యువతులు వెదురుబుట్టల్లో ఏర్పాటు చేసిన గోధుమ మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తీజ్ ఉత్సవాలను ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. ఈ ఉత్సవాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో బంజారా జాతీయ నాయకులు కేశవ నాయక్, సుబ్రహ్మణ్యం నాయక్, ఉమాపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

యువకులపై దాడి

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 22: పట్టణంలోని మోదినాబాద్‌లో తప్పిపోయిన ఆవు దూడ కోసం వెళ్లిన బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కరాటే రవితేజ, అతని స్నేహితుడు మోహన్‌పై శనివారం షఫి దాడి చేశాడు. బాధితులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. చంద్ర అనే వ్యక్తికి చెందిన ఆవు దూడ నాలుగు రోజుల క్రితం తప్పిపోయింది. ఈ విషయాన్ని చంద్ర కరాటే రవితేజ దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో శనివారం అర్థరాత్రి చంద్ర, కరాటేరవితేజ, మోహన్ మోదీనాబాద్‌లో షఫి ఇంటి వద్దకు వెళ్లి అతని సోదరులను ఆవుదూడ ఆచూకీ గురించి ఆరా తీశారు. వారు తమ వద్ద లేవని సమాధానమిచ్చారు. అదే సమయంలో ఇంట్లో నుంచి వచ్చిన షఫీ కరాటేరవితేజను చూసి నీకు ఇక్కడేమి పని అంటూ దాడికి దిగాడు. ఇందులో రవితేజ ఎడమ కన్ను కిందగాయమైంది, మోహన్‌కు ఎడమ కాలుకి గాయమైంది. వీరిని కుటుంబసభ్యులు ఆదివారం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మంజుల వెంకటేష్ ఆసుపత్రిలో బాధితులను పరామర్శించారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసి, పాతబస్టాండ్‌లో పెద్ద మటన్ దుకాణాల ను బంద్ చేయాలని డిమాండ్ చేశారు.



ప్రభుత్వ ఆస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న బీజేవైఎం నాయకులు

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కరాటే రవితేజ, మోహన్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని కోరుతూ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆదివారం రాత్రి బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మంజుల వెంకటేష్ ఆధ్వర్యంలో నాయకులు నిరసన తెలిపారు. జైశ్రీరాం, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న టూటౌన్, రూరల్ సీఐలు ఏపీ మస్తాన్, మహేశ్వర్‌రెడ్డి, రూరల్ ఎస్‌ఐ రాఘవేంద్రప్ప ఆసుపత్రి వద్దకు చేరుకుని నిరసన తెలుపుతున్న వారిని అరెస్టు చేశారు.

వాలీబాల్ విభాగంలో శ్రీవాణి విద్యార్థినుల ప్రతిభ

తాడిపత్రి, సెప్టెంబరు 22: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి వాలీబాల్ అండర్ -14 విభాగంలో శ్రీవాణి పాఠశాల విద్యార్థినులు దీప్తి, మహబూబ్‌బీ ప్రతిభ చూపారని కరస్పాండెంట్ నీలకంఠ ఆదివారం ప్రకటనలో తెలిపారు. స్థానిక అరవింద పాఠశాల మైదానంలో జరిగిన వాలీబాల్ పోటీల్లో దీప్తి, మహబూబ్‌బీ పాల్గొని ప్రతిభచూపి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆయన తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కరస్పాండెంట్‌తోపాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.



ప్రతిభచూపిన విద్యార్థినులు

రిజర్వాయర్‌కు 854 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 22: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఆదివారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 854 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2కు 878 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.658 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వెల్లడించారు.

సీపీఐ నియోజకవర్గ సమావేశం

తాడిపత్రి, సెప్టెంబరు 22: పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం పార్టీ నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య అధ్యక్షతన నియోజకవర్గస్థాయి సమావేశం జరిగింది. ముఖ్యఅతిథులుగా జిల్లా కార్యదర్శి జాఫర్, నియోజకవర్గ ఇన్‌చార్జి రాజారెడ్డి హాజరై మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం సీపీఐ నిత్యం శ్రమిస్తోందన్నారు. ప్రజల పక్షాన నిలబడే ఏకైక పార్టీ సీపీఐ అన్నారు. అన్ని మండలాల్లో పార్టీని బలోపేతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుపేదలకు ఇళ్లస్థలాలను పంపిణీచేయాలన్నారు. లేనిపక్షంలో పార్టీ తరఫున పేదలకు స్థలాలను పంపిణీ చేస్తామని తెలిపారు. మండల కార్యదర్శి నాగరంగయ్య, నాయకులు రామాంజనేయులు, హుస్సేన్ పీరా, అల్లాబకాష్, బాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే సమస్యలను పరిష్కరించండి

గుంతకల్లు, సెప్టెంబరు 22: పట్టణంలో రైల్వే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం డీఆర్‌ఎంను కోరారు. వారు ఆదివారం ఉదయం స్థానిక డీఆర్‌ఎం కార్యాలయానికి వచ్చి డీఆర్‌ఎం విజయకుమార్‌ను కలిసి మాట్లాడారు. ముఖ్యంగా కసాపురం దేవస్థానానికి వెళ్లే దారిలో ఉన్న రైలు వంతెన వద్ద ప్రజలకు సమస్యలు ఎదురౌతున్నాయని, ఆ వంతెనను వెడల్పు చేసే విషయంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే వంతెనల వద్ద మురుగు నీటిని తరలించేందుకు డ్రైయిన్ల నిర్మాణానికి తగిన అనుమతులు వచ్చేలా చూడాలన్నారు. ధర్మవరం గేటు, బళ్లారి బైపాస్ రోడ్డు వద్ద ఆర్‌యూబీల నిర్మాణాల విషయంపై డీఆర్‌ఎంతో చర్చించారు. పట్టణంలో రైల్వే శాఖ నిర్మించిన అడ్డుగోడల వద్ద దారి వదలాలని కోరారు. ఎంపీ, ఎమ్మెల్యే విజ్ఞప్తులను రైల్వే బోర్డు అనుమతుల కోసం పంపుతామని డీఆర్‌ఎం తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, తలారి మస్తానప్ప, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రైల్వే కోచ్ వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేయాలి

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 22: పట్టణంలో రైల్వే కోచ్ వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను సీపీఐ నాయకులు కోరారు. పట్టణంలోని డీఆర్‌ఎం కార్యాలయంలో డీఆర్‌ఎంతో ఆదివారం సమావేశానికి విచ్చేసిన ఎంపీ, ఎమ్మెల్యేలను సీపీఐ నాయకులు కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దక్షిణమధ్య రైల్వేలో గుంతకల్లు డివిజన్ చాలా పెద్దదన్నారు. గుంతకల్లులో కోచ్ వర్క్‌షాపును ఏర్పాటు చేస్తే వందలాది మంది ఉద్యోగాలు వస్తాయన్నారు. కోచ్ వర్క్‌షాప్‌నకు ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్, పట్టణ కార్యదర్శి గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా షంషేర్ ఊరేగింపు



షంషేర్‌ను ఊరేగిస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో బడేషావలి సమాధి

విడపనకల్లు, సెప్టెంబరు 22: మండలంలోని వీ కొత్తకోట గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న బడేషావలి ఉరుసు ఉత్సవాలు ఆదివారం షంషేర్ ఊరేగింపుతో ముగిశాయి. షంషేర్ ను గుర్రంపై ఉంచి గ్రామవీధుల్లో ఊరేగించారు. ఊరేగింపు దర్గాకు చేరుకోగానే ప్రార్థనలు చేసి ఉరుసును ముగించారు. గ్రామస్థులు కందూరు ఇచ్చి మొక్కులను తీర్చుకున్నారు. మరి కొంత మంది చక్కెర చదివించారు. శుక్రవారం ప్రారంభమైన ఉరుసు ఉత్సవాలకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్‌ఐ ఖాజా హుస్సేన్ సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహించారు. దర్గా కమిటీ పెద్దలు, గ్రామ సర్పంచ్ తిమ్మరాజు, భీమిరెడ్డి, ఖాదర్ బాషా, నబీసాబ్. తదితరులు పాల్గొన్నారు.

నెయ్యి కల్తీపై విచారణ చేయించాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మధుసూధన్ గుప్తా

గుత్తి, సెప్టెంబరు 22: తిరుపతి శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడకం పట్ల విచారణ జరపాలని, అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ గుప్తా కోరారు. పట్టణంలోని ఆర్‌ఎస్‌లో గల వెంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం హిందువులతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో తిరుపతి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడడాన్ని ఖండించారు. కొంతమంది తిరుమల పవిత్రతను అపవిత్రం చేయాలని చూస్తున్నారని పరోక్షంగా వైఎస్ జగన్‌పై మండిపడ్డారు. జగన్ ప్రభుత్వంలో తిరుపతి లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి వాడలేదని నిరూపిస్తే ఆయనకు క్షమాపణలు చెప్పి వెంకటేశ్వరస్వామికి తలనీలాలు సమర్పిస్తానని అన్నారు. ఒకవేళ వినియోగించారని రుజువైతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేవిధంగా ప్రవర్తిస్తే ఎవరైనా సరే తగిన బుద్ధి చెబుతామన్నారు. కార్యక్రమంలో కొట్రికె శ్రీహరి, వెంకటేశ్వరరెడ్డి, బీజేపీ పట్టణ, మండల అధ్యక్షులు బాలకృష్ణ, నారాయణరెడ్డి, తిమ్మారెడ్డి, సత్యనారాయణ, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

12 గంటల్లో 17 ఎకరాల్లో గుంటక పాసిన రైతు

● గోవిందవాడలో అరుదైన రికార్డు సృష్టించిన హనుమంతు



మిరప పంటలో గుంటక పాస్తున్న రైతు హనుమంతు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 22: మండలంలోని గోవిందవాడ గ్రామానికి చెందిన రైతు హనుమంతు అరుదైన రికార్డు సృష్టించాడు. కేవలం 12 గంటల్లో 17.20 ఎకరాల్లో ఎద్దులతో గుంటక పాసి అందరి చేత శభాష్ అనిపించుకున్నాడు. గ్రామస్థులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గోవిందవాడ గ్రామంలో గురురాజుకు చెందిన 10 ఎకరాలు, దివాకర్‌కు చెందిన 7.20 ఎకరాల మిరపపంటలో హనుమంతు తన ఎద్దులతో వేకువజామున 4 నుంచి గుంటక పాయడాన్ని మొదలు పెట్టి సాయంత్రం 4 గంటలకు పూర్తి చేశాడు. దీంతో టీడీపీ నాయకులు సోమనాథ్‌గౌడ్, బండి లోకేష్, నటరాజ్, రాతింటి వన్నూరుస్వామి హనుమంతును అభినందిస్తూ సన్మానించారు. సాధారణంగా ఈ 17.20 ఎకరాల్లో గుంటక పాయాలంటే మూడు, నాలుగురోజులు సమయం పడుతుందని, 12 గంటల్లో 17.20 ఎకరాల్లో గుంటక పాయడం ఆషామాషి కాదని గ్రామస్థులు తెలిపారు.

సాగునీరు విడుదల చేయండి

● మంత్రి రామానాయుడికి టీడీపీ నాయకుల విన్నపం

తాడిపత్రి, సెప్టెంబరు 22: తాడిపత్రి ప్రాంతంలోని చెరువులు, డ్యామ్‌లు, కెనాల్‌కు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని టీడీపీ నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, జగన్నాథరెడ్డి, హరినాథ్‌రెడ్డి, సో మశేఖర్‌నాయుడు, లోకనాథ్‌రె డ్డి రాష్ట్ర జలవనరుల శాఖామం త్రి నిమ్మల రామానాయుడుకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. కర్నూలు నుంచి జీడీపల్లి రిజర్వాయర్ వద్దకు వెళుతున్న మంత్రికి నియోజకవర్గంలోని పెద్దవడుగూరు మండలం కాశేపల్లి టోల్‌ప్లాజా వద్ద టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం నియోజకవర్గంలోని సాగు నీటికి సంబంధించిన సమస్యలను విన్నవించారు. మంత్రిని కలిసిన వారిలో టీడీపీ మండల కన్వీనర్ నరేంద్రనాయుడు, నాయకులు శశిధర్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, చింబిలి ప్రసాద్‌నాయుడు ఉన్నారు.

యాడికి కాలువకు నీటిని విడుదల చేయాలి..

యాడికి: యాడికి కాలువకు, రాయలచెరువు గ్రామ చెరువుకు నీటిని విడుదల చేసి మండల రైతాంగాన్ని ఆదుకోవాలని మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, తెలుగుయువత జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ పరిమి చరణ్ మంత్రి నిమ్మల రామానాయుడుకు విన్నవించారు. కాశేపల్లి టోల్‌ప్లాజావద్ద వారు మండల రైతులతో మంత్రిని కలిసి సాగునీటి సమస్యపై విన్నవించారు.

చివర ఆయకట్టు వరకు సాగునీరందించాలి..

పెద్దవడుగూరు: మండలంలోని రైతులకు సాగునీరు అందించి ఆదుకోవాలని మండల టీడీపీ నాయకులు మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతిపత్రం అందజేశారు. కాశేపల్లి టోల్‌ప్లాజా వద్ద వారు ఆయన్ను కలిసి మాట్లాడారు. హెచ్చెల్సీలో పేరుకుపోయిన చెత్త ను తొలగించి చివర ఆయకట్టు వరకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరా రు. మంత్రిని కలిసిన వారిలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, సీనియర్ నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రెటరీ దివాకర్‌రెడ్డి ఉన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి..

పుట్లూరు: కడప జిల్లా గండికోట ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేసి యల్లనూరు, పుట్లూరు మండలాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని టీడీపీ మండల నాయకుడు చవ్వా కులశేఖర్‌రెడ్డి మంత్రి నిమ్మల రామానాయుడికి వినతిపత్రం అందజేశారు. ఆయన మంత్రిని కాశేపల్లి టోల్‌ప్లాజా వద్ద కలిసి మాట్లాడారు. గండికోట నుంచి పైప్‌లైన్ ద్వారా ఎత్తిపోతలు చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ప్రస్తుతం వచ్చే హెచ్చెల్సీ నీటితో మండలంలోని మూడు చెరువులను నింపాలని కోరారు.

హంద్రీనీవా కాలువను ఆధునికీకరించండి

ఉరవకొండ: హంద్రీనీవా కాలువను ఆధునికీకరణ చేసి డిస్ట్రిబ్యూటరీల ద్వారా సాగునీరు ఇవ్వాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున కోరారు. ఈ మేరకు బెళుగుప్ప మండలం జీడీపల్లిలో మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతి పత్రాన్ని అందజేశారు.

జాతరపై గ్రామస్థులతో సమావేశం

యల్లనూరు, సెప్టెంబరు 22: మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయ నిర్వాహకులు ఆదివారం సాయంత్రం గ్రా మస్థులతో సమావేశం నిర్వహించారు. సుమారు 9 సంవత్సరాలుగా అమ్మవారికి జాతర జరపలేదని, ఇప్పుడు జరుపు దామని చర్చించారు. ఇందుకోసం వచ్చే ఏడాది జనవరి 18, 19వ తేదీలు అనుకూలంగా ఉంటాయని నిర్ణయించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.